RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 18 ఫిబ్రవరి 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:218

# నగరంలో

## పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలి

విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించం
ప్రకటనల ఆదాయం పెంపుపై కసరత్తు చేయాలి
మల్టీలెవల్ పార్కింగ్... స్కైవాక్ మార్కెట్లపై అధ్యయనం చేయండి
నూతన మేయర్లు.. డిప్యూటీ మేయర్లు.. ఛైర్మన్లు... డిప్యూటీ ఛైర్మన్లతో త్వరలో సమావేశం
పురపాలక శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



హైదరాబాద్: మూడు నగర పాలక సంస్థల పరిధిలో పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాను ప్రత్యక్ష పరిశీలనకు వస్తానని... ఎక్కడైనా చెత్త కనపడితే సహించమని అధికారులను సీఎం హెచ్చరించారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి నగర పాలక సంస్థల కమిషనర్లు తెల్లవారుజామున ఆరు గంటలకే క్షేత్ర పర్యటనలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రకటనల ఆదాయం పెంపు పాలసీపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆదాయం పెంపునకు తీసుకోవాల్సిన పలు అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. నగరంలో కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలక్ట్రిక్, ఇతర కేబుళ్లు, సీసీ కెమెరాలు, ప్రకటనల బోర్డులు వాటిపై ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు భూముల్లోనూ మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్డు పక్కన పలు ప్రాంతాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. ప్రకటనలకు సంబంధించి పెద్ద మొత్తంలో వివిధ రకాల బోర్డులు కనిపిస్తున్నా ఆశించిన ఆదాయం రాకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ముంబయి, అహ్మదాబాద్, బెంగళూర్‌ల్లోని ప్రకటనల ఆదాయంతో నగరంలో వస్తున్న ఆదాయాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరిస్తున్న ప్రకటనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రకటనలకు 10 శాతం బోర్డులు కేటాయించాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా పీపీపీ, ఇతర నమూనాల్లో ఆదాయం సమకూర్చుకునే అంశంపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దానిని పరిశీలించిన ముఖ్యమంత్రి పలు సూచనలు, సలహాలు అందజేశారు. మూడు నగర పాలక సంస్థలతో పాటు రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో వీధి దీపాల నిర్వహణ విషయంలో యూనికోడ్ సిస్టమ్ అనుసరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు నగర పాలక సంస్థల పరిధిలోని పార్కుల వివరాలు సేకరించాలని.. వాటి అభివృద్ధిపైన ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారు.× ఒక రోజు శిక్షణ...రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు.. ఛైర్మన్లు, డిప్యూటీ ఛైర్మన్లతో త్వరలోనే ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరాలు, పట్టణాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు.. ఇతర అంశాలను వివరించాలని సూచించారు. తాను సమావేశానికి హాజరై నూతనంగా ఎన్నికైన వారితో మాట్లాడాతానని సీఎం తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు , సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనర్లు ఆర్.వి.కర్ణన్, సృజన, వినయకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ పనులను పర్యవేక్షించిన

## ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



మెడికల్, ఫైర్, పొల్యూషన్ కంట్రోల్, వాటర్, ఎలక్ట్రిసిటీ, ఆర్ అండ్ బీ తదితర శాఖల ఉనతాధికారులతో టిమ్స్ ఎమర్జెన్సీ బ్లాక్‌లో మంత్రి సమీక్ష..ఉగాది నాటికి అన్ని సౌకర్యాలతో హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రిహాస్పిటల్‌కు నీళ్లు, పవర్ సప్లైలో ఎలాంటి ఆటంకం ఉండకూడదని, 24 గంటల సరఫరా ఉండాలని సూచనఫైర్ సేఫ్టీ విషయంలో రాజీ ఉండకూడదని, అన్ని ఫ్లోర్లలో పూర్తిస్థాయి పరిశీలన చేయాలని అగ్నిమాపకశాఖ అధికారులను ఆదేశించిన మంత్రి..రిసెప్షన్ ఏరియా, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, ఓపీ కన్సల్టేషన్ రూమ్స్, డయాగ్నస్టిక్స్, ఇన్ పేషెంట్ వార్డులు, ఫార్మసీ తదితర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి..పేషెంట్ల సంఖ్యకు అనుగుణంగా ఓపీ, ఫార్మసీ కౌంటర్లు ఉండాలని అధికారులకు సూచించిన మంత్రిసీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, అల్ట్రాసౌండ్ తదితర యంత్రాలను పరిశీలించిన మంత్రి.. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యంత్రాలు పూర్తిస్థాయిలో పేషెంట్లకు ఉపయోగపడాలని, ఇందుకు అవసరమైన డాక్టర్లు, ఇతర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు.ఉగాది నాటికి అన్ని సౌకర్యాలతో అన్ని హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని మంత్రి సూచించారు.ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి, వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు జేఎండీ మయాంక్ మిట్టల్, డీఎంఈ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.



## క్యూర్ పరిధిలోఇందిరమ్మ ఇండ్లు

మార్చి చివరి నాటికి లబ్దిదారుల ఎంపిక
అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి చర్యలు
యుద్ధప్రాతిపదికన లబ్దిదారుల ఎంపిక
ఆర్,ఆర్, ఆర్, – ఓ ఆర్ ఆర్ మధ్య అఫర్డ్‌బుల్ హౌసింగ్ పాలసీ
ఈనెల చివరిలోగా ఇండ్ల స్థలాలు కలిగిన 28వేల మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు
క్యూర్ పరిధిలో హౌసింగ్ పాలసీపై అధికారులతో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి , శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ సమీక్ష



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిహైదరాబాద్:– హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధి లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి వచ్చే మార్చి చివరినాటికి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ,అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి వివి గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమీషనర్లు పాల్గొన్నారు. పట్టణాల్లోని మురికివాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని హైదరాబాద్‌కు దూరంగా గతంలో 42వేల ఇండ్లను నిర్మించగా అందులో సగం మంది మాత్రమే అక్కడ నివసిస్తున్నారని ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో తేలిందని సమావేశంలో అధికారులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చాలాచోట్ల బోగస్ లబ్దిదారులు కూడా ఉన్నారని అధికారులు మంత్రులకు వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా ,నిరుపేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా, వారి నివాస ప్రాంతాలకు దగ్గరగా స్థానిక పరిస్థితులను బట్టి ఐదు నుంచి 10 అంతస్థుల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే ఆలోచన చే?స్తున్నామని ,వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముగ్గురు మున్సిపల్ కార్పొరేషన్ల కమీషనర్లు, నాలుగు జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో వారి వారి ప్రాంతాలలో స్థలాలను గుర్తించి ఎన్ని ఇండ్లు నిర్మించవచ్చు, ఎంతమంది లబ్దిదారులు ఉన్నారు వంటి వివరాలతో పదిరోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు.

క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మురికివాడల్లో స్థలం ఉన్నవారు అంగీకరిస్తే ఆ ప్రాంతంలో జీప్లస్ 5 వరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి అభివృద్ధి చేయాలన్న ఆలోచన చేస్తున్నామని జేఎన్ఎన్‌యూఆర్ ఎం పథకంలో నిర్మించిన ఇండ్లు శిధిలావస్థకు చేరాయని వాటి స్థానంలో కూడా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే ఆలోచన చేస్తున్నామన్నారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఇండ్ల స్థలాలు ఉన్న 28వేల మంది లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న, ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మార్చి చివరినాటికి లబ్దిదారులను ఎంపిక చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు లబ్దిదారులను గుర్తించి ఆ లబ్దిదారులే ఆ ఇండ్లను పూర్తి చేసుకోవడానికి అంతకుముందు ఖర్చుచేసిన మొత్తాన్ని పరిగణనలోకి తీసుకొని మిగిలిన నిధులను హౌసింగ్ కార్పొరేషన్ నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు. చాలా చోట్ల ఇండ్లు తీసుకొని అక్కడ నివాసం లేని వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని , అలాగే బోగస్ లబ్దిదారులను కూడా గుర్తించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనర్హుల స్థానంలో రాజకీయాలకు అతీతంగా సమీపంలో ఉన్నఅర్హులైన పేదలను ఎంపిక చేయాలని కలెక్టర్లకు సూచించారు. 2 బిహెచ్‌కే నివాస ప్రాంతాలలోని ప్రతి ఇంటికి తాగునీరు, విద్యుత్, డ్రైనేజ్ వంటి కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ మీటర్లను లబ్దిదారుల పేర్లకు బదిలీ చేయాలని అలాగే 2బిహెచ్‌కే కాలనీల్లో తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాలు, ఎస్టీపీలు, మరియు యూజీడీల వ్యవస్థ హైదరాబాద్ వాటర్ బోర్డు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఆర్,ఆర్, ఆర్, – ఓ ఆర్ ఆర్ మధ్య అఫర్డ్‌బుల్ హౌసింగ్ పాలసీ ఆర్,ఆర్, ఆర్, – ఓ ఆర్ ఆర్ పరిధిలో మధ్యతరగతి ప్రజల కోసం గతంలో కెపిహెచ్‌బిలో నిర్మించిన మాదిరిగానే ఇండ్లను నిర్మిస్తామని ఇందుకు నాలుగు ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

## ప్రత్యూష కేసులో సుప్రీం తుది తీర్పు... సిద్ధార్థ రెడ్డి నాలుగు వారాల్లో లొంగిపోవాలి



హైదరాబాద్ ఫిబ్రవరి 17 ;: 24 ఏళ్ల క్రితం సంచలనం సృష్టించిన ప్రత్యూష కేసులో సుప్రీంకోర్టు తుది తీర్పు వెల్లడించింది. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ నిందితుడు గుడిపల్లి సిద్ధార్థరెడ్డి నాలుగు వారాల్లో లోంగిపోవాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు విధించిన జైలు శిక్షను సవాల్ చేస్తూ సిద్ధార్థరెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సిద్ధార్థ రెడ్డి పిటిషన్ కొట్టివేయడంతో పాటు లోంగిపోవాలని ఆదేశించింది. ప్రత్యూష అనే యువతి సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఇంటర్ చదువుతున్నపుడు సిద్ధార్థరెడ్డి పరిచయం కావడంతో ఇద్దరు ప్రేమలో పడ్డారు. వీళ్ల ప్రేమను సిద్దార్థ రెడ్డి కుటుంబం ఒప్పుకోకపోవడంతో 2002 ఫిబ్రవరి 23న ప్రేమ జంట పురుగుల మందు తాగారు. వెంటనే ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ప్రత్యూష చనిపోగా సిద్ధార్థరెడ్డి ప్రాణాలతో బయటపడ్డాడు. ప్రత్యూషను ఆత్మహత్యకు ఉసిగొల్పాడని అతడికి స్థానిక కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. అతడు హైకోర్టును ఆశ్రయించడంతో సిద్ధార్థ రెడ్డికి రెండేళ్ల జైలు శిక్ష విధించింది. తన కూతురిది ఆత్మహత్య కాదని ప్లాన్ చేసి హత్య చేశారని సుప్రీంకోర్టులో ప్రత్యూష తల్లి సరోజినీ దేవి పిటిషన్ వేసింది. ఇవాళ సుప్రీంకోర్టు విచారణ జరిపి తుది తీర్పు ఇచ్చింది. సిద్ధార్థ రెడ్డి బెయిల్ పిటిషన్ కొట్టివేయడంతో పాటు రెండేళ్ల జైలు శిక్షను కూడా సమర్థించింది. సిద్ధార్థ రెడ్డి నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. టాలీవుడ్‌లో సముద్రం, రాయుడు, కలుసుకోవాలని సినిమాలలో నటించి ప్రత్యూష మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకుంది. బాలనటిగా ప్రేక్షకుల మెప్పుపొందారు. ఆమె కెరీర్ పీక్ స్టేజీలో ఉన్నప్పుడు ఆమె హఠాత్తుగా చనిపోవడంతో అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. 24 సంవత్సరాల తరువాత నిందితుడికి శిక్ష పడడంతో ఆమె అభిమానులు సరైన న్యాయం జరిగిందని తెలిపారు.

ప్రజాబలం

18 ఫిబ్రవరి 2026 బుధవారం

# ఏఐతో భవిష్యత్తు..

నలభై ఆరేళ్ల క్రితం అంటే 1980లో దేశంలో కంప్యూటరీకరణను విస్తరింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా ఆందోళనలు తలెత్తాయి. 1984 సంవత్సరాన్ని 'యాంటీ కంప్యూటరైజేషన్ సంవత్సరం'గా పరిగణించారు. దీంతో తమ ఉద్యోగాలు పోతాయని, ఆర్థికంగా దెబ్బతింటాయని, దేశంలో తీవ్ర పరిస్థితులు తలెత్తుతాయని కార్మికులు నిరసన ప్రదర్శనలు సాగించారు. అయితే రానురాను డిజిటల్ టెక్నాలజీని అమలు లోకి విస్తారంగా తీసుకు రావడంతో సమాజంలోని అన్ని వర్గాల్లో, దేశం మొత్తం మీద ఆలోచనల్లో మార్పు రావడం ప్రారంభమైంది. కంప్యూటర్లు, ఆధునిక సాంకేతికత భారీగా ఉద్యోగాలు కల్పిస్తాయని, జీవితంలో అనేక విధాలుగా ఉపయోగపడతాయని నమ్మకం పెరిగింది. ఎఐ (కృత్రిమ మేధ) ఆధునిక ప్రపంచంలో కీలకమైన కేంద్రంగా వర్ధిల్లుతోంది. ఇప్పుడు ఎక్కడ విన్నా ఎఐ గురించే చర్చ వినిపిస్తోంది. మానవ చరిత్రలో ఇప్పటివరకు ఎన్నో పెద్దమార్పులు వచ్చాయి. కానీ ఇప్పుడు ఎఐ అన్నది అత్యంత శక్తివంతమైన, అతి గొప్ప ఆవిష్కరణల్లో ఒకటిగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ సాంకేతిక నాయకత్వంలో భారత్ అగ్రస్థానం సాధించాలన్న లక్షంతో ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్' ప్రారంభం కావడం చెప్పుకోదగిన ఘట్టం. ఎఐ యుగం నియమాలు, ప్రమాణాలు, అవకాశాలను రూపొందించడంలో మనదేశం కీలకంగా ఉండాలనే ప్రధాన లక్షంతో ఏర్పాటైన ఈ సదస్సు గురించి ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తివంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందని వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే దేశంలో ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పరిపాలన, వంటి అనేక రంగాల్లో ఎఐ కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు 22 రంగాల్లోని 17 రంగాల కంపెనీలు తమను తాము ఎఐ సాంతికత దిశగా మార్చుకోవలసిన ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఎఐతో ఎక్కువ అనుబంధం ఉన్న ఐటి వంటి రంగాల్లో పెద్ద మార్పులు వస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ ఎఐ సిఇఒ ముస్తఫా సులేమాన్ వచ్చే 18 నెలల్లో కంప్యూటర్ ఉద్యోగాలన్నీ ఎఐతో భర్తీ అవుతాయని అంచనా వేశారు. ఎఐ వల్ల 2035 నాటికి ప్రపంచ జిడిపి (స్థూల దేశీయోత్పత్తి) లో 15 శాతం పాయింట్లు పెరగవచ్చని ఏడాది క్రితం ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ అనే సంస్థ అంచనా వేసింది. అంటే ప్రతి సంవత్సరం సుమారు 1 శాతం అదనపు అభివృద్ధి తథ్యమన్న అంచనాలు వెలువడ్డాయి. ఈ సదస్సు ఒక బలీయమైన జాతీయ ఎఐ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి మాత్రమే ప్రయత్నించకుండా ప్రపంచ దక్షిణార్థ దేశాలను కూడా ఇందులో భాగస్వాములను చేయాలన్న తపన కనిపిస్తోంది. ఆయా దేశాలు కృత్రిమ మేధపై తమ ప్రణాళికలను ఈ వేదికపై వెల్లడించే అవకాశం కనిపిస్తోంది. అయితే ఎఐ ప్రణాళికలకు సంబంధించి భారత్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. ఈ సాంకేతికతకు కావలసిన కనీస సెమీ కండక్టర్లు లేదా కంప్యూటర్ చిప్‌లు తయారు చేసే సామర్థం ఇంకా భారత్‌కు అలవడ లేదు. ప్రస్తుతం దేశంలో ఎఐ సంపూర్ణ సామర్థంతో ఏ కంపెనీ లేదు. అలాగే మెగా డేటా సెంటర్లు లేవు. పాత్రధారులు, నాటకం స్క్రిప్టు, కనీసం వేదిక లేకుండా ఏదైనా నాటకం ఎలా ప్రదర్శించలేరో అలాగే క్షేత్రస్థాయిలో కనీస మౌలిక అవసరాలులేకుండా ఎఐ సాంకేతికతను సాధించడం కష్టతరమే. అయినప్పటికీ ఎఐకి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ గత కొన్నేళ్లుగా ఏర్పడి చిగుళ్లు మొలకెత్తడం ప్రారంభమైంది. రెండేళ్లుగా సెమీకండక్టర్ల తయారీ అత్యంత నాటకీయంగా ఆవిర్భావమైంది. ఈ ఏడాది జనవరి నాటికి దేశం లోని ఆరు రాష్ట్రాల్లో 10 సెమీ కండక్టర్ తయారీ ప్రాజెక్టులు వచ్చాయని, వీటిలో కొన్ని ఆన్‌లైన్‌లో ఉన్నాయని ప్రభుత్వం అంచనాగా చెబుతోంది. ఇక రెండో అంశం.. దేశంలో మెగా డేటా సెంటర్ల ఏర్పాటును ప్రోత్సహించడం గత ఏడాది గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, డిజిటల్ కనెక్షన్, తదితర ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థలు 2030 వరకు ఎఐ, క్లౌడ్ మౌలిక సదుపాయాల్లో దాదాపు 68 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టడానికి నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు చిప్ డిజైన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ పర్యావరణం నెలకొల్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే చెప్పవచ్చు. ఈ సమయంలో ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లభిస్తేనే ఊపందుకుంటుంది. ఆయా ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థల అధినేతలు భారతదేశ సామర్థం గురించి ఆశావహులుగా ఉన్నారు. జెన్‌సెన్ హుయాంగ్, గూగుల్ సిఇఒ సుందర్‌పిచాయ్, తదితరులు భావితరానికి ఎఐ సాంకేతిక కేంద్రంగా భారత్ వర్ధిల్లుతుందని, ఎఐని భారత్ ముందుకు తీసుకెళ్తుందని అభిప్రాయాలతో దృఢమైన విశ్వాసం వెలిబుచ్చడం గమనార్హం. భారత్‌లో మానవ వనరులకు లోటు లేదని, ఎఐ అమలు స్థాయి మరింత ముందుకు వెళ్తుందని చెబుతున్నారు. ఇప్పటికే ఎఐ ఫ్రంట్రన్నర్ చాట్ జిపిటిలో ప్రపంచం మొత్తం మీద రెండో భారీ మార్కెట్‌గా భారత్ ఉంటోందని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సామ్ అల్ట్‌మాన్ అంగీకరించారు. ఎఐ నమ్మదగిన ముఖ్యమైన మార్కెట్‌గా అభివర్ణించారు. ఇవన్నీ ఎఐ సంస్థలకు భారత్ ఆకర్షణీయ కేంద్రంగా మారుస్తున్నాయి. ఏఐ వల్ల పలు ఉద్యోగాలకు పోతాయని ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రముఖ బిలియనీర్, పారిశ్రామిక వేత్త వినోద్ ఖోస్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐ టూల్స్ రాబోయే ఐదేళ్లలో ఐటీ సేవలు, బీపీఓ ఉద్యోగాలు దాదాపు కనమరుగవుతాయని అంచనా వేశారు. రానున్న 15 ఏళ్లలో నైపుణ్య ఆధారిత వృత్తులు తుడిచిపెట్టుకుపోతాయని హెచ్చరించారు. అయితే విద్య, వైద్య సంరక్షణ అందరికీ అందుబాటులో వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 నేపథ్యంలో హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వినోద్ ఖోస్లా మాట్లాడారు. బిపిఓ లేదా బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ అనేది కంపెనీలు థర్డ్-పార్టీ సర్వీస్ ప్రొవైడర్లకు అవుట్‌సోర్స్ చేసే లార్జ్ సెగ్మెంట్ వర్క్‌ను సూచిస్తుంది. ఏఐ వల్ల ఇది తీవ్రంగా ప్రభావితమవుతుందని తెలిపారు. ఇండియాలోనే ఐటీ సర్వీసెస్‌పై కూడా ఇదే తరహా ప్రభావ ఉంటుందని అంచనా వేశారు. ఏఐ సిస్టమ్స్ ఆర్థికంగా విలువైన పనులలో మానవులను అధిగమించగల స్థితికి వేగంగా చేరుకుంటున్నాయని ఆయన తెలిపారు. ఏఐ అనేది డిజిటల్ అసిస్టెంట్స్ నుండి అటానమస్ ఏఐ వర్కర్క్ దిశగా మారుతుందని, అకౌంటింగ్, లా, మెడిసిన్, చిప్ డిజైన్ వంటి రంగాలు మరో దశాబ్దకాలంలో ఏఐ వల్ల ప్రభావితం కావచ్చని తెలిపారు. ఈ తరుణంలో ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఢిల్లీలో ప్రారంభం కావడం శుభోదయమే. ఇది విజయవంతమైతే ఈ శిఖరాగ్ర సమావేశం భారతీయ సంకల్పానికి కేవలం ఒక వేడుకలా మాత్రమే కాకుండా, ప్రపంచానికే కీలకమైన మలుపుగా మారుతుందన్న ఆశ కలుగుతోంది.

## సీఎం కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజ్ కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు







**అచ్చంపేట ప్రజాబలం ప్రతినిధి:** మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా లోని అచ్చంపేట నియోజకవర్గం మద్దిమడుగు గ్రామంలోని పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయం ను రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజ్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి ఘన స్వాగతం పలికారు. దేవాలయంలో ముందుగా వినాయకుడు ను దర్శించుకుని, గజస్తంభం వద్ద నమస్కరించారు. అనంతరం ప్రధాన ఆలయంలో ఆంజనేయుడు ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య శాస్త్రి ఆలయ చరిత్ర, విశిష్టతను వివరించారు. అనంతరం ఆలయంలోని శివలింగాన్ని దర్శించుకున్నారు. వేద పండితులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వాదాలు ప్రసాదించారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ స్థాపనకు ప్రతిపాదించిన 20 ఎకరాల స్థలాన్ని

### జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్ తో కలిసి పరిశీలించిన

## సీఎం కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజ్







**అచ్చంపేట ప్రజాబలం ప్రతినిధి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి కే .యస్ శ్రీనివాస్ రాజ్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ, ఇతర గిరిజన నాయకులు మరియు అధికారులు కలిసి నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని పదర మండలం మద్దిమడుగు గ్రామంలో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ స్థాపనకు ప్రతిపాదించిన 20 ఎకరాల స్థలాన్ని వారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య కార్యదర్శి శ్రీనివాస్ రాజ్ మాట్లాడుతూ..., గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని దేశంలోనే అతిపెద్దదిగా నిర్మించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి, స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు పేర్కొన్నారు. లంబాడీల సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా విగ్రహ నిర్మాణానికి సంబంధించి పది నెలల్లో పక్కా ప్రణాళికలు రూపొందించి, త్వరలో అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలిపారు. ప్రతిపాదిత స్థలం నల్లమల్ల అటవీ ప్రాంత పరిధిలో ఉండటంతో భౌగోళిక పరిస్థితులు, భద్రతా అంశాలు, రవాణా సౌకర్యాలు మరియు ప్రజలకు సులభ వసతులు ఉండేలా వంటి అంశాలను అధికారులు సమగ్రంగా చర్చించి ప్రణాళికలు రూపొందించి ముఖ్యమంత్రికి సమర్పించనున్నట్లు తెలిపారు. స్థానిక అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన మౌలిక వసతులపై చర్చించారు. బంజారా సమాజానికి ఆధ్యాత్మిక మార్గదర్శకుడిగా గుర్తింపు పొందిన సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ నిర్మాణం ద్వారా సమాజానికి, దేశానికి గౌరవ సూచకంగా ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. స్థానిక గిరిజన నాయకులతో చర్చించి అందుకు అనుగుణంగా విగ్రహ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ....,సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం దేశానికి ఒక దిక్సూచిగా నిలుస్తుందని నల్లమల్ల ముద్దుబిడ్డ రేవంత్ రెడ్డి సంకల్పించడం ఎమ్మెల్యేగా నా అదృష్టంగా భావిస్తున్నానని, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మద్దిమడుగు ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. దేశంలోనే నల్లమల్ల ప్రాంతం సుస్థిరంగా నిలిచిపోయేలా ముఖ్యమంత్రి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కృష్ణా నదిపై వంతెనను నిర్మిస్తే ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలకు రమణ సౌకర్యంతో పాటు మద్దిమడుగు పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ.....,సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పం ముఖ్యమంత్రికి బలంగా ఉండడం గిరిజనుల అదృష్టంగా భావిస్తున్నట్లు ఎంపీ తెలిపారు. సమ్మక్క సారక్క జాతరలో ఏ విధమైన అభివృద్ధి చెందిందో మద్దిమడుగు అదే తరహాలో అభివృద్ధి చెందాలని సంకల్పంతో ముఖ్యమంత్రి ఉన్నారని, మైదాన ప్రాంతంలో నివసించే గిరిజనులను అభివృద్ధి పరచాలని ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఉందని అదే స్థాయిలో ముఖ్యమంత్రి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్లో సంత్ సేవాలాల్ విగ్రహాలకు ఆదర్శంగా తీసుకొని నల్లమల్లలో అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసే విగ్రహాన్ని దేశస్థాయి ప్రతిష్టను ప్రతిబింబించేలా ఉంటుందని ఎంపీ ఈ సందర్భంగా తెలిపారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ...,గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గిరిజన ల అదృష్టంగా భావిస్తున్నామని, గిరిజన ప్రాంతాల అభివృద్ధి ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు అదేవిధంగా గిరిజన ప్రాంతాలను అభివృద్ధి పరుస్తూ వారి ఆర్థిక స్థితిగతులను పెంచే విధంగా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ మాట్లాడుతూ.....,రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆలోచనలు ముందుకు తీసుకుపోయే విధంగా జిల్లా యంత్రాంగం అన్ని వసతులతో పాటు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విగ్రహ ఏర్పాట్లకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ విగ్రహ ఏర్పాట్లు రానున్న సంవత్సర కాలంలో పూర్తిచేసేలా నిరంతరం జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈ ఎన్ సి మోహన్ నాయక్ , ఆలిండియా బంజారాల నాయకుడు రామ్ నాయక్, ఇతర గిరిజన నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలి

### ఎపి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అమరావతి ఫింబ్రవరి 17 విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలని ఎపి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. శాసనసభకు రావటం ఎమ్మెల్యేల విధి అన్నారు. అసెంబ్లీ లాబీలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు చిట్ చాట్ చేశారు. కొందరు అసలు సభకే రాకుండా జీతభత్యాలు తీసుకోవటం తగదని సూచించారు. ఉద్యోగులకు జీతాలు కట్ చేసే నిబంధనల ఎమ్మెల్యేలకు ఎందుకు వర్తించకూడదు? అని ప్రశ్నించారు. ఈ అంశాన్ని జాతీయ స్థాయిలో చర్చ చేపట్టానని, ఈ నిబంధన దాదాపు 8 దేశాల్లో అమల్లో ఉందని తెలియజేశారు. అసెంబ్లీ లో ప్రవేశ పెట్టిన డిజిటల్ అటెండెన్స్ బాగా పనిచేస్తోందని, ఎవరు ఎంతసేపు సభలో ఉన్నారనేది కూడా రికార్డవుతోందని అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలి ఎపి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడుఅమరావతి ఫింబ్రవరి 17 (ఎక్స్ ప్రెస్స్ న్యూస్ );: విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలని ఎపి శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. శాసనసభకు రావటం ఎమ్మెల్యేల విధి అన్నారు. అసెంబ్లీ లాబీలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు చిట్ చాట్ చేశారు. కొందరు అసలు సభకే రాకుండా జీతభత్యాలు తీసుకోవటం తగదని సూచించారు. ఉద్యోగులకు జీతాలు కట్ చేసే నిబంధనల ఎమ్మెల్యేలకు ఎందుకు వర్తించకూడదు? అని ప్రశ్నించారు. ఈ అంశాన్ని జాతీయ స్థాయిలో చర్చ చేపట్టానని, ఈ నిబంధన దాదాపు 8 దేశాల్లో అమల్లో ఉందని తెలియజేశారు. అసెంబ్లీ లో ప్రవేశ పెట్టిన డిజిటల్ అటెండెన్స్ బాగా పనిచేస్తోందని, ఎవరు ఎంతసేపు సభలో ఉన్నారనేది కూడా రికార్డవుతోందని అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు.

# నూతన గ్రంథాలయం ఏర్పాటుతో నైపుణ్యాభివృద్ధి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** యువత, విద్యార్థులు, పాఠకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా నైపుణ్యాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. మంగళవారం నార్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నూతన డిజిటల్ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఈ గ్రంథాలయం మంచి అవకాశమని తెలిపారు. సివిల్ సర్వీసెస్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఇది ఉపయోగకరమని చెప్పారు. డిజిటల్ యుగాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంటర్నెట్ సౌకర్యంతో కూడిన సిస్టమ్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. భారత్ దేకో సంస్థ ద్వారా ఐదు ల్యాప్‌టాప్‌లు అందించబడినట్లు తెలిపారు. వీటి ద్వారా విద్యార్థులు ఆన్‌లైన్ కోర్సులు, మోటివేషనల్ వీడియోలను ఉచితంగా వీక్షించవచ్చన్నారు. గ్రంథాలయంలో పుస్తకాలతో పాటు వార్తాపత్రికలు, మ్యాగజైన్లు అందుబాటులో ఉంచాలని, గ్రామ పంచాయతీ సమన్వయంతో నిర్వహణ చేపట్టాలని సూచించారు. మండలంలో ఐటీ స్కిల్ సెంటర్, ఇంగ్లీష్ ఫౌండేషన్ లెర్నింగ్ ప్రోగ్రామ్, త్వరలో ట్రైబల్ మ్యూజియం ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యువత వ్యసనాలు, మొబైల్ దృష్టి మరల్చే అలవాట్లకు దూరంగా ఉండి వసతులను వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ నర్సయ్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు ఆధునిక వసతులు కల్పించడం వల్ల పట్టణ విద్యార్థులతో సమానంగా పోటీ పడగలరన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, సర్పంచ్ కావేరీ, డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, నీతి ఆయోగ్ ప్రోగ్రామ్ అధికారి రాహుల్, ఎంపీడీవో పుల్లారావు, తహసిల్దార్ రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక నైపుణ్యాల పెంపు దిశగా స్కిల్ బిల్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ వర్క్‌షాప్




**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 17 (ప్రజాబలం)** ఖమ్మం స్థానిక పొన్నేకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు కళాశాలలో స్కిల్ బిల్డ్ ? ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశం పై ఒక రోజు వర్క్‌షాప్ ఘనంగా నిర్వహించబడింది ఈ కార్యక్రమానికి కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక ముఖ్య అతిథిగా హాజరై వర్క్‌షాప్‌ను ప్రారంభించారు ఈ సందర్భంగా డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషిస్తున్నదని, విద్యార్థులు తాజా సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుని తమ కెరీర్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని






సూచించారు. భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ఉంటాయని పేర్కొన్నారు కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. లక్ష్మి నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకొని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు డీన్ డా. వి. సుదర్శన్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ టెక్నాలజీ ఆరోగ్యం, విద్య, పరిశ్రమ వ్యవసాయం వంటి అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని, ప్రాక్టికల్ జ్ఞానం చాలా ముఖ్యమని తెలిపారు ఈ వర్క్‌షాప్‌లో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఐబిఎమ్ హెడ్ శ్రీ రాఘవేందర్ రావు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క ప్రాథమిక అంశాలు, మెషీన్ లెర్నింగ్ డేటా అనలిటిక్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిశ్రమలో ప్రస్తుతం అవసరమైన నైపుణ్యాలు, ప్రాజెక్టుల ప్రాముఖ్యత, మరియు ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని అనేక సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల జరిగిన కార్యక్రమం లో టి పి ఓ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి డిప్లమా ఇన్చార్జి కృష్ణ ప్రసాద్ డాక్టర్ జ్యోతి డాక్టర్ ప్రణతి డాక్టర్ చార్యులు సురేష్ పాల్గొన్నారు

# భారత్ స్కౌట్ అండ్ గౌడ్స్ విద్యార్థులను అభినందించిన హైదరాబాద్ కలెక్టర్ హరిచందన



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైద్రాబాద్ ఫిబ్రవరి 17ఇటీవల లక్నోలో జరిగిన ఆలిండియా డిమాండ్ జూబ్లి జమ్బురి లో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో పాల్గొన్న హైదరాబాద్ జిల్లా వివిధ ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ప్రతిభను కనబరిచారు.ముఖ్యంగా అతిదిలను కలర్ పార్టీ ద్వారా హైదరాబాద్ విద్యార్థులు తమ ప్రావిన్యాని ప్రదర్శించి మొదటి స్తానం లో నిలిచారు.ఈమేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ను విద్యార్థులు కలిసారు.భారత స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులను కలక్టర్ సర్టిఫికెట్ల లో సత్కరించారు ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు డిఇఓ ఆర్.రోహిణి, పాటశాల ప్రదానోపాద్యురాలు కె విజయలక్ష్మి, ఆసిహిస్సులు అందజేశారు. హైదరాబాద్ స్కౌట్స్ మాస్టర్ జిల్లా శిక్షణ కమిషన్ కాచిగూడలో ఫిజికల్ డైరెక్టర్,అధ్యాపకులు లక్ష్మణ్ నాయక్ , పాఠశాల విద్యార్థులు ముఖేష్,ఉత్తేజ్,కవిత,సంధ్య, స్టాఫ్ సభ్యులు మరియు,మేడమ్ పలువురు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# వట్టిపల్లి దర్గాను దర్శించుకున్న మంత్రి వట్టిపల్లి మండల కేంద్రంలో ఉన్న ఖ్వాజ షరీఫ్ దర్గాను



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 17 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** వట్టిపల్లి మండల కేంద్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం, దర్గా ఏ అజ్రత్ సయ్యద్ షా ఖ్వాజ దాస్ ఖ్వాజ షరీఫ్ వారి 4వ వార్షిక ఆరాధన మహోత్సవం, (ఉర్సు ఉత్సవం)లో ఈరోజు మంగళవారం, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి, దామోదర్ రాజనర్సింహ, పాల్గొన్నారు, వట్టిపల్లి మండల కేంద్రంలో ఉన్న,ఖ్వాజ షరీఫ్ దర్గాను, దర్శించుకున్నారు, అనంతరం షరీఫ్ దర్గాకు చద్దర్ ను సమర్పించారు, దర్గాలో నిర్వహించిన, ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు, అనంతరం సామూహిక భోజనాశాలలో, నేలపై కూర్చొని భక్తులతో కలిసి, మంత్రి దామోదర్ రాజనర్సింహ, సహపంక్తి భోజనం చేసి, తన నిరాడంబరాన్ని చాటారు....

# మర్పల్లిలోతెలంగాణ తొలి ముఖ్యమంత్రికల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు జన్మదిన సంబరాలు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఫిబ్రవరి 17 ( ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి బి ఆర్ ఎస్, మండల ప్రెసిడెంట్ రావులపల్లి సర్పంచ్, శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ తొలిముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా సంబరాలు జరిపినట్టు తెలిపారు, కేక్ కటింగ్ తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంచి పెట్టడం జరిగిందని తెలిపారు,తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహానేత కెసిఆర్ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని స్థాపించి, తెలంగాణ స్వప్నాన్ని ప్రజల ఉద్యమంగా మలిచిన గొప్ప




నాయకుడు ఆయన.దీర్ఘకాల ఉద్యమం, నిరాహార దీక్షలు, అపార త్యాగాలతో 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో ఆయన పాత్ర చారిత్రాత్మకం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, ఆయన సుదీర్ఘ పాలనలోరైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, ఆసరా పెన్షన్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి అనేక ప్రజా సంక్షేమ పథకాలతో రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేశారుతెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా, సంకల్పబలం కలిగిన దూరదృష్టి నాయకుడిగా ఆయన పేరుచిరస్మరణీయంఈజన్మదినసందర్భంగాఆయనఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవ చేయాలని మనస్ఫూర్తిగాకోరుకుంటున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో మర్పల్లి మండల అధ్యక్షులు రావులపల్లి సర్పంచ్,శ్రీకాంత్ రెడ్డి , మాజీ జెడ్పిటిసి మధుకర్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, మర్పల్లి మండల వైస్ ప్రెసిడెంట్ డి అశోక్,రమేష్ మిత్ర, మండల యూత్ అధ్యక్షులు మధుకర్, టౌన్ ప్రెసిడెంట్ గఫర్, అంజయ్య గౌడ్,యువ నాయకుడు శ్రీకాంత్,ఆయా గ్రామాల మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు, ఉప సర్పంచ్లు, పెద్దలు సీనియర్ నాయకులు యువకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని బర్డే కార్యక్రమం విజయవంతం చేసినట్టు తెలిపారు

# జహీరాబాద్ మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం .చైర్మన్ గా మహ్మద్ యూనుస్., వైస్ చైర్మన్ గా కొత్త కప్పు శిరీష రెడ్డి.







**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 17(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**జహీరాబాద్/జహీరాబాద్ మున్సిపల్ పీఠం ఉత్కంఠకు తెర తొలగింది, జహీరాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 37 వార్డులకు బీజేపీ 3, బీఆర్ఎస్ 15,కాంగ్రెస్ 14,ఎఐ ఎఐఎం 2,స్వతంత్రులు 3,గెలుపొందగ జహీరాబాద్ మున్సిపాలిటీ హాంగ్ కు వేదిక అయ్యింది, చైర్మన్ పీఠం ఎవరికో అని అయోమయం ఏర్పడి స్వతంత్రులు కీలక పాత్ర పోషించించారు,మంగళవారం జరిగినచైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో బీఆర్ఎస్ 15 బీజేపీ 3,ఎక్సఅఫిసియో ఓటుగా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావుతో మొత్తం 19 మందితో బీఆర్ఎస్ రాగా,కాంగ్రెస్ 14, ఎఐ ఎఐఎం 2, స్వతంత్రులు 3,ఎక్సఅఫిసియో ఓటుగా జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ షట్కార్ 20 మంది కౌన్సిలర్లతో రావడంతో చైర్మన్ పీఠం కాంగ్రెస్ పార్టీకి దక్కింది,కోరం సభ్యులు హాజరైన అనంతరం ప్రత్యేక అధికారి చైర్మన్ వైస్ చైర్మన్ల ఎంపిక ప్రక్రియను చేపట్టారు,15వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి 679 ఓట్ల మెజారిటీతో గెలుపొందిన మహమ్మద్‌యూనుస్ మున్సిపల్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేయగా,16 వార్డు స్వాతంత్ర అభ్యర్థి కొత్తకాపు శిరీష రెడ్డి వైస్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేశారు, అనంతరం జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ షట్కార్ నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు,ఎంపీ మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణ అభివృద్ధిలో నూతన పాలకవర్గం చురుకైన పాత్ర పోషించాలని,ప్రజా సమస్యల పరిష్కారమే దేయంగా పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు,ఈ కార్యక్రమంలో ఆయా వాడు కౌన్సిలర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఇలాకాల్లోని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మారని వైద్యుల తీరు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 17 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రి గురించి,వచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం సాయంత్రం జోగిపేట,ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని, మంత్రి దామోదర రాజనర్సింహ, ఆకస్మిక తనిఖీ చేశారు,విధుల్లో 23, మంది వైద్యులు ఉండగా, అందుబాటులో మాత్రం ఒకే డాక్టర్ ఉండడం విశేషం,దీంతో ఆస్పత్రిలో కలియ తిరిగిన మంత్రి దామోదర రాజనర్సింహ, ఆస్పత్రి అన్ని రిజిస్టర్ లను క్షుణ్ణంగా పరిశీలించారు,జోగిపేట ఆసుపత్రి ఇక మారదా అంటూ జిల్లా (డిసిహెచ్ఎస్) అధికారిని ఫోన్లో సీరియస్ అయ్యారు, సంజాయిషీ నోటీసులు, షోకాజ్ నోటీసులు, జారీ చేయడం కాదు,వెంటనే విధుల్లో నుండి సస్పెండ్ చేయండి అని మంత్రి ఆదేశించిన సంగతి తెలిసిందే,ఈ ఆస్పత్రిలో ఎన్ని పోస్టులు ఖాళీ ఉన్నాయి ఏమిటి అన్న పూర్తి వివరాలతో పాటు, ఈరోజు ఎంతమంది విధులకు రాలేదో, వారి జాబితాను తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ కు పంపాలని ఆదేశించారు,మంత్రి ఆదేశాల మేరకు డిసిహెచ్ఎస్ డాక్టర్ షరీఫ్, మంగళవారం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి మధ్యాహ్నం చేరుకున్నారు, అన్ని వార్డుల్లో కలియ తిరిగి రోగులతో నేరుగా వారి సమస్యలను అడగగా, పేషెంట్ కు బెడ్ పైన రెస్ట్ గా ఉండేందుకు వీల్ బెడ్స్ రోగులకు వెస్టన్ బాత్రూం కావాలి అని చెప్పడంతో, ఆ అధికారి ఆ సమస్య కూడా తీరుస్తామని హామీ ఇచ్చారు,అలాగేఅంబులెన్స్ సౌకర్యం గురించి రోగులను అడగగా, 108 మాత్రమే ఉచితంగా సేవ చేస్తుందిఆసుపత్రిలో ఉండే



అంబులెన్స్ కు మాత్రం వెయ్యి రూపాయల డీజిల్ 200 బత్త ఇవ్వాలి అని, వారు నేరుగా జిల్లా అధికారికి వెల్లడించారు,వెంటనే ఆ డ్రైవర్ను పిలిపించిన డిసిహెచ్ఎస్ డబ్బులు వసూలు చేయడం ఏమిటి అని అడగగా,ఇప్పుడు కొత్తగా కాదు సార్ గత 25 ఏళ్లుగా వసూలు చేస్తున్నామని చెప్పడం గమనార్హం,మంత్రి, ఆదేశాల మేరకు షోకాస్ నోటీసులు, సంజాయిషులు,కాకుండా ఎంతమంది వైద్యులపై శాఖ పరమైన చర్య తీసుకుంటున్నారని పాత్రికేయులు అడగగా,మంత్రి వచ్చినప్పుడు ఆప్షన్ లో ఉన్న ఏడు మంది వైద్యులతో పాటు,అలాగే చీటికిమాటికి దుమ్మాలు కొట్టే వైద్యుల పైన కూడా, దీనికి తోడు ఔట్సోర్సింగ్ అంబులెన్స్ డ్రైవర్ పై కూడా, 24 గంటల్లోపు తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ కి నివేదిక పంపడం జరుగుతుందన్నారు,ఈ ఆస్పత్రిలో మొత్తంగా 31 మంది డాక్టర్లు అవసరం ఉంది,కానీ ప్రస్తుతానికి 20 పోస్టులు ఖాళీ ఉన్నాయి, కొందరిని ఆసుపత్రులలో నుండి సర్దుబాటు చేస్తూ 23 మందిని కేటాయించామని ఆయన అన్నారు,ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టిలో కూడా ఉంది, కలెక్టర్కు కూడా నివేదిక సమర్పిస్తామని అన్నారు,ఇన్ని ప్రశ్నలు వేస్తున్నా డాక్టర్ డిసిహెచ్ఎస్ షరీఫ్ కి పాత్రికేయులపై ఒక్కసారిగా కోపం వచ్చినట్లుంది,అసలు పూర్తిస్థాయిలో మంత్రి కోరిన ప్రకారం నివేదిక ఇస్తాడా..? లేదా దుమ్మాలు చేసుకుంటూ వస్తు రోగుల పట్ల శాపంగా మారుతున్న వైద్యులను వెనకేసుకొస్తాడా..! అనేది అనుమానస్పదంగా ఉందని చెప్పక తప్పదు,మంత్రి ఆదేశాలను, బేఖాతరు చేస్తాడా, యాక్షన్ తీసుకునే విధంగా రిపోర్ట్ ఇస్తాడా అనేది వేచి చూడాల్సిందే.!

# వేములవాడలో 8వ తెలంగాణ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం.




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎనిమిదవ తెలంగాణ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించడం జరిగింది. ఈ వాలీబాల్ క్రీడా పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుండి బాలుర మరియు బాలికల పోటీలు నిర్వహించడం జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న సందర్భంగా క్రీడాకారులు, క్రీడాకారునిలు ఇట్టి అవకాశాలను ఉపయోగించుకొని ఉన్నత స్థానాలకు ఎదిగాలని ఆకాంక్షించారు. వాలీబాల్ పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులకు ప్రభుత్వం విప్ క్రీడాకారులకు కావలసిన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగింది. నూతనంగా ఎన్నికైన వేములవాడ మున్సిపల్ పాలకవర్గానికి క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి, అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# 3 రకాల మెంబర్ షిప్ తో జనసేన

విజయవాడ, ఫిబ్రవరి 17, జనసేన పార్టీ తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కార్యకర్తల భాగస్వామ్యాన్ని క్రమబద్ధీకరించేందుకు సరికొత్త సభ్యత్వ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో పార్టీలో మూడు రకాల సభ్యత్వ వర్గాలను నిర్ణయించింది. జనసేన పార్టీ తన శ్రేణులను మూడు విభాగాలుగా విభజించింది. మొదటి వారిని ఉద్యమి గా పిలుస్తారు. వీరు పార్టీపై నమ్మకం, అభిమానంతో ప్రాథమిక సభ్యత్వం తీసుకున్న వారు. రెండవ కేటగిరీకి చెందిన వారిని సాధక్ అని పిలుస్తారు. వీరు కేవలం సభ్యులుగానే కాకుండా, పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తూ, పార్టీ ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే క్రియాశీలక పాత్ర పోషిస్తారు. ఇక మూడవ కేటగిరీలోకి ప్రధాతలు వస్తారు. వీరు పార్టీకి వివిధ రూపాల్లో ఆర్థికంగా లేదా మేధోపరంగా అండగా నిలుస్తూ, నాయకత్వ బాధ్యతలు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేస్తారు.సభ్యత్వ నమోదు ప్రక్రియను పారదర్శకంగా మరియు సులభంగా నిర్వహించేందుకు జనసేన పార్టీ డిజిటల్ పద్ధతులను అవలంబిస్తోంది. ప్రతి సభ్యుని వివరాలను ఆన్‌లైన్ డేటాబేస్‌లో నిక్షిప్తం చేయడం ద్వారా, భవిష్యత్తులో వారికి ఇన్సూరెన్స్ వంటి ప్రయోజనాలను అందించాలని పార్టీ భావిస్తోంది. ముఖ్యంగా యువతను ఈ ఉద్యమి-సాధక్-ప్రధాత ' విధానం వైపు ఆకర్షించడం ద్వారా పార్టీలో జవాబుదారీతనం పెరుగుతుందని నాయకత్వం ఆశిస్తోంది.ఏపీలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ప్రతి గ్రామం, వార్డులో జనసేన జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది. సాధారణ సభ్యుల నుండి నాయకుల వరకు వారి పనితీరు , అంకితభావాన్ని బట్టి ఈ వర్గీకరణలో గుర్తింపు లభిస్తుంది. ఈ నూతన విధానం ద్వారా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపడంతో పాటు, క్రమశిక్షణతో కూడిన రాజకీయ వ్యవస్థను నిర్మించాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు.

# దోమలపై హైటెక్ యుద్ధం

కర్నూలు, ఫిబ్రవరి 17, ప్రజారోగ్యానికి పెను సవాల్ విసురుతున్న దోమలపై హైటెక్ యుద్ధానికి ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. దోమల నియంత్రణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలు ఉపయోగించనుంది. ఏఐ ఆధారంగా పనిచేసే స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ ద్వారా దోమలను కట్టడి చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా తిరుపతిలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ విధానాన్ని పరిశీలించనున్నారు. అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా మరిన్ని నగరాలకు విస్తరించాలనే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉంది. తిరుపతిలో ప్రైవేట్ సంస్థకు ఈ పనులు అప్పగించనున్నారు.దోమలు.. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా.. ప్రతి ఒక్కరినీ వేధిస్తున్న సమస్య. ప్రజారోగ్యానికి ప్రధాన సవాలు విసురుతున్నవి దోమలే.. ఈ నేపథ్యంలో దోమలపై హైటెక్ యుద్ధానికి ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. టెక్నాలజీ సాయంతో దోమలకు చెక్ పెట్టాలని భావిస్తోంది. అందులో భాగంగా కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే స్మార్ట్ దోమల నిఘా వ్యవస్థ (స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్) అందుబాటులోకి తెస్తోంది ఏపీ ప్రభుత్వం. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో తొలుత ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించనున్నారు. ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు ఈ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ విస్తరించే ఆలోచనలు చేస్తున్నారు.స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్‌లో భాగంగా తొలుత ముందుగా నిర్ణయించిన కొన్ని ప్రాంతాలలో ఐవోటీ పరికరాలు ఏర్పాటు చేస్తారు. ఈ పరికరాలు ప్రత్యేకమైన వాసన కలిగి ఉంటాయి. ఫిరమోన్ సాయంతో ఈ ప్రత్యేక వాసన వచ్చేలా అధికారులు వీటిని రూపొందించారు. దీంతో దోమలను ఇవి సులువుగా ఆకర్షిస్తాయి. దీని ద్వారా ఆ ప్రాంతంలో దోమల సాంద్రత ఎలా ఉంది.. అవి ఏ జాతి దోమలు, వాటి లింగం ఏంటనే వివరాలను ఈ ఐవోటీ పరికరాలు గుర్తిస్తాయి. ఈ సమాచారాన్ని వెంటనే సెంట్రల్ డ్యాష్ బోర్డుకు పంపిస్తుంది. ఈ డ్యాష్ బోర్డు.. ఏఐ సాయంతో ఈ వివరాలను విశ్లేషించి.. ఆ ప్రాంతంలో దోమల తీవ్రత ఎలా ఉందనే దానిపై అధికారులను అప్రమత్తం చేస్తుంది. ఆ తర్వాత దోమల నియంత్రణ కోసం డ్రోన్ల సాయంతో మందులను పిచికారీ చేసేలా ప్రణాళికలు రచించారు.మరోపతి తిరుపతిలో దోమలు అధికంగా ఉండే 250 హాట్‌స్పాట్లు గుర్తించారు. వీటిలోని కొన్ని ప్రాంతాలలో జాప్ ట్రాపులు, ఐవోటీ సెన్సార్లు ఏర్పాటు చేయనున్నారు. 20 లక్షలతో నాలుగుచోట్ల ఈ పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే తిరుపతిలో ఈ పనులను ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించనున్నారు. ఈ నాలుగుచోట్ల వచ్చే ఫలితాల ఆధారంగా తిరుపతి మొత్తం ఈ సేవలు విస్తరించే ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఈ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్‌ను తిరుపతితో పాటుగా విశాఖ, విజయవాడ, కర్నూలు, కాకినాడ, నెల్లూరు, రాజమండ్రి ప్రాంతాల్లో అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

# ఏప్రిల్ 1 నుంచి రైల్వే జోన్...

విశాఖపట్టణం, ఫిబ్రవరి 17, దక్షిణ కోస్తా జోన్ కార్యకలాపాలకు సంబంధించి కీలక ముందడుగు పడుతోంది. విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటవుతున్న జోన్ కార్యకలాపాలు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులకు సమాచారం వచ్చినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 1న కొత్త రైల్వే జోన్?కు అపాయింటెడ్? డేగా ప్రకటించబోతున్నారట. ఈ నెలాఖరుకు ప్రకటన వస్తుందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ముఖ్యంగా ఉత్తరాంధ్రవాసుల కల నెరవేరబోతోంది. కొత్త రైల్వే జోన్‌కు సంబంధించి అపాయింటెడ్ డేకు ముహూర్తం ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. అన్ని కుదిరితే ఏప్రిల్ 1 నుంచి కొత్త రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే విభజన ప్రక్రియలో భాగంగా.. ఆరు డివిజన్లు విడిపోతున్నాయి. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్‌లు మాత్రమే ఉంటాయి. కొత్తగా దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటు కాబోతోంది.. అందులో కొత్తగా ఏర్పడే విశాఖపట్నం డివిజన్, తూర్పుకోస్తా జోన్‌లో కొంతభాగం, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు కలిపి ఉంటాయి.కొత్తగా ఏర్పాటవుతున్న రైల్వే జోన్‌కు ఏప్రిల్ 1న అపాయింటెడ్ డేగా ప్రకటించే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటి నుంచి చూస్తే ఆరు వారాల సమయం ఉంది.. మరి అంత తక్కువ సమయం సరిపోతుందా అనే అంశంపై కూడా తెరపైకి వచ్చింది. త్వరలోనే దీనిపై ఓ క్లారిటీ వస్తుందని.. ఈ నెలాఖరు లోపు కొత్త జోన్ అపాయింటెడ్ డేపై నోటిఫికేషన్ వస్తుందని భావిస్తున్నారు. రైల్వే బోర్డుకు తొమ్మిది నెలల క్రితమే డివిజన్ల వారీగా విభజన ప్రక్రియతో పాటుగా మిగిలిన అంశాలపై డీపీఆర్ పంపించారు. ఈ మేరకు విభజన ప్రక్రియను చేపట్టారు. ఈ నెలలోనే అపాయింటెడ్ డే ప్రకటిస్తారని భావిస్తున్నారు.కేంద్రం ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. గత పదేళ్లుగా కొత్త రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రం నుంచి వినతులు అందజేశారు. గతేడాది ఫిబ్రవరి నెలలో కేంద్ర కేబినెట్ కొత్త రైల్వే జోన్‌కు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కొత్త రైల్వే జోన్‌కు జీఎంతో పాటుగా అవసరమైన అధికారుల్ని, మిగిలిన కసరత్తును చేపట్టింది. ఈ మేరకు అవసరమైన సరిహద్దుల్లో మార్పులు చేర్పులు, రైళ్ల నిర్వహణ, ఆదాయ వ్యయాలు వంటి అంశాలపై కసరత్తు చేశారు. ఇప్పుడు అపాయింటెడ్ డేను ప్రకటించే దిశగా అడుగులుపడుతున్నాయి. అలాగే ఆయా డివిజన్లలో మార్పులు, చేర్పులు చేయనున్నారు.విశాఖపట్నంలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ జీఎం తాత్కాలిక కార్యాలయాన్ని సిరిపురంలో ఉన్న డెక్ భవనంలో ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ రెండు అంతస్తుల్ని లీజు కింద తీసుకున్నారు. అలాగే దక్షిణ కోస్తా రైల్వే జోన్ శాశ్వత ప్రధాన కార్యాలయం పనులు కూడా వేగవంతం అయ్యాయి. ముడసర్లోవలో ఏపీ సర్కార్ భూమిని కేటాయించగా.. అక్కడ పనులు ప్రారంభం అయ్యాయి.. గతేడాది జనవరిలో ప్రధాని మోదీ ఈ పనులకు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. మొత్తం 54 ఎకరాలను కార్యాలయం కోసం కేటాయించారు. రూ.192 కోట్లతో పరిపాలనా భవనానికి ఖర్చవుతుందని అంచనా వేశారు.. 12 అంతస్తుల్లో భవనం నిర్మిస్తున్నారు.

# కొత్త బాధ్యతలతో జేడీ

ఒంగోలు, ఫిబ్రవరి 17, జేడీ లక్ష్మీనారాయణ.. తెలుగు ప్రజలకు పరిచయం అక్కరలేని పేరు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి మరణానంతరం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వైఎస్సార్ కొడుకు, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై పెట్టిన అక్రమాస్తుల కేసు విచారణతో సీబీఐ డైరెక్టర్‌గా జేడీ లక్ష్మీనారాయణ గుర్తింపు పొందారు. తర్వాత ఉద్యోగం నుంచి స్వచ్ఛంద రిటైర్మెట్ తీసుకున్న ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. పార్టీ పెట్టారు. 2019 ఎన్నికల్లో పార్టీ తరఫున అభ్యర్థులను నిలిపి పోటీ చేశారు. కానీ అప్పటి వైసీపీ ధాటికి ఒక్క సీటు కూడా గెలవలేదు. తర్వాత విశ్లేషకుడిగా, మోటివేటర్‌గా కొనసాగుతూ వచ్చారు. మహారాష్ట్ర కేడర్ ఐపీఎస్ అయిన లక్ష్మీనారాయణ ఇప్పుడు కొత్త ఉద్యోగంలో చేరారు. మేఘా ఇంజినీరింగ్ అనుబంధ సంస్థ ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నియామకాన్ని సంస్థ లింక్డ్‌ఇన్‌లో ప్రకటించింది.ఎన్ఐటీ వరంగల్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ బీటెక్, ఐఐటీ మద్రాస్‌లో ఎంటెక్ పూర్తి చేసిన ఆయన అశోక్ లేల్యాండ్ ఆర్ అండ్ డీలో కెరీర్ ప్రారంభించారు. 1990 బ్యాచ్ మహారాష్ట్ర కేడర్ ఐపీఎస్‌గా ముంబైలో అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా ఉద్యోగ విరమణ చేశారు. 2006?13 మధ్య సీబీఐలో జగన్ అక్రమాస్తుల కేసు సహా హైప్రొఫైల్ దర్యాప్తులు చేపట్టారు.పదవీవిరమణ తర్వాత జనసేన పార్టీ తరఫు విశాఖపట్నం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2023లో జై భారత్ నేషనల్ పార్టీ స్థాపించారు. తూర్పు గోదావరి ధర్మవరంలో పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం కూడా చేశారు. కుమారుడు ఆల్ ఇండియా సర్వీసులో పనిచేస్తున్నారు.హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఈవీ ట్రాన్స్ దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ బస్ ఆపరేటర్. తెలంగాణ ఆర్టీసీ ఒలెక్ట్రా బస్సులు, ముంబై, పుణే, గోవాలోని వాహనాలు తయారు చేస్తుంది. లక్ష్మీనారాయణ ఆర్థిక, కార్యాంగ నిర్వహణ అనుభవం సంస్థ విస్తరణకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే.. ఇటీవల లక్ష్మీనారాయణ భార్య ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్‌లో రూ.2.58 కోట్లు కోల్పోయారు. లాభాలు హామీ ఇచ్చి మోసం చేసినవారిపై జనవరిలో సైబర్ క్రై మ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# హిందూపురంలో షాకింగ్ వీడియో

అనంతపురం, ఫిబ్రవరి 16, సమాజంలో మహిళల పట్ల, చిన్నారుల పట్ల అమానుషాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఇవి వెలుగు చూస్తున్నా.. పోలీసులు కఠిన చర్యలకు దిగుతున్నా నియంత్రణలోకి రావడం లేదు. ఈ లైంగిక వేధింపులకు సంబంధించి రాజకీయ నేతలపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. అటువంటిదే మరో ఘటన సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని హిందూపురం నియోజకవర్గంలో ఓ మైనర్ బాలికపై.. ఓ పార్టీకి చెందిన గ్రామ నాయకుడు వేధింపులకు దిగాడు. వికృత చేష్టలకు పాల్పడ్డాడు. సోషల్ మీడియాలో పెడతానని బెదిరించి అఘాయిత్యానికి ప్రయత్నించాడు. ప్రస్తుతం ఈ వీడియో విపరీతంగా వైరల్ అవుతోంది.ఇటీవల మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలు ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రధానంగా రాజకీయ పార్టీల నేతలు ఈ వేధింపులకు దిగుతున్నారు. బాధితులుగా మారుతున్న వారు ఆ వీడియోలను బయటపెట్టి న్యాయం చేయాలని కోరుతున్నారు. మరోవైపు నేరాలకు పాల్పడుతున్న వారు ఆ వీడియోలను తీసి పైశాచిక ఆనందం పొందుతున్నారు. ఈ క్రమంలో ఆ వీడియోలు బయటకు వస్తున్నాయి. అయితే ఈ మొత్తం వ్యవహారంలో మహిళలు, చిన్నారులు బాధితులుగా ఉండగా.. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రత్యర్థులు ఈ వీడియోలను వైరల్ చేస్తున్నారు.హిందూపురం నియోజకవర్గంలో ఓ గ్రామానికి చెందిన చోటా నాయకుడు.. ఓ మైనర్ బాలిక పట్ల అమానుషంగా ప్రదర్శించాడు. అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగిక దాడికి ప్రయత్నిస్తున్న వీడియోలు ఇప్పుడు బయటకు వచ్చాయి. సదరు నాయకుడు పాఠశాలకు వెళ్తున్న బాలికను ట్రాప్ చేసి.. ఓ ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి ప్రయత్నించే క్రమంలో.. వికృత చేష్టలకు పాల్పడ్డాడు. అలా చేసి సెల్ఫోన్లో చిత్రీకరించి.. తిరిగి బాధితురాలను బ్లాక్ మెయిల్ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ వీడియోలు బయటకు రావడంతో.. సదరు నేతపట్ల ఆరోపణలు వచ్చి పడుతున్నాయి. ప్రధాన నాయకుడికి అనుచరుడిగా ప్రచారం నడుస్తోంది

## రేవంత్ రెడ్డి ఇలాకాలో తిరగబడ్డ సొంత పార్టీ నాయకులు

నారాయణపేట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి కాన్వాయ్ పై కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు రాళ్ళ దాడి చేసారు. మద్దూరు మున్సిపాలిటీలో కొడంగల్ ఇన్చార్జి తిరుపతి రెడ్డిని అడ్డుకుని రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పదవి విషయంలో వివాదం తలెత్తింది. గొడవ ముదరడంతో పోలీసులు లాఠీలకు పనిచేప్పారు. తిరుపతి రెడ్డి అక్కడినుంచి వెళ్లిపోయారు.

## రాజస్థాన్‌లో భారీ అగ్నిప్రమాదం..

## ఏడుగురు సజీవ దహనం



రాజస్థాన్ భివాడిలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో ఘటనఫ్యాక్టరీ వస్త్రాల కర్మాగారంగా చలామణి అవుతూ అక్రమంగా బాణాసంచా తయారు చేస్తున్నారన్న జిల్లా అదనపు మెజిస్ట్రేట్ సుమిత్రా పారీక్ ఏడుగురు మృతిపై ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రగ్భ్రాంతిరాజస్థాన్ భివాడిలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో నిన్న భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. మరో ఇద్దరు ఫ్యాక్టరీలోనే చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డారు. అకస్మాత్తుగా ఫ్యాక్టరీలో మంటలు చెలరేగగా.. కొద్ది సేపటికే భారీ పేలుళ్లు సంభవించాయి. దీంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేసి సహాయక చర్యలు చేపట్టారు. భద్రతా కారణాల దృష్ట్యా ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లోని ప్రజలను ముందస్తుగా ఖాళీ చేయించారు. కాగా ప్రమాదంలో చిక్కుకున్న ఇద్దరు కార్మికులను రక్షించి ఆసుపత్రికి తరలించారు. ఇక ఈ ఫ్యాక్టరీ వస్త్రాల కర్మాగారంగా చలామణి అవుతూ అక్రమంగా బాణాసంచా తయారు చేస్తున్నట్లు జిల్లా అదనపు మెజిస్ట్రేట్ సుమిత్రా పారీక్ వెల్లడించారు.

## కాంగ్రెస్‌ను ఓడించే పని ప్రారంభించిన కాంగ్రెస్ నేతలు - మణిశంకర్ అయ్యర్‌తో స్టార్ట్ !

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17, (న్యూస్ పల్స్) అస్సాం నుండి కేరళ వరకు కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న తాజా పరిణామాలు ఆ పార్టీ అంతర్గత సంక్షోభాన్ని మరోసారి బట్టబయలు చేశాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల నగారా మోగకముందే నాయకుల మధ్య మొదలైన విభేదాలు, వివాదాస్పద వ్యాఖ్యలు పార్టీకి పెద్ద తలనెప్పిగా మారాయి. అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు భూపేన్ బోరా తన పదవికి రాజీనామా చేస్తూ ఆత్మగౌరవం దెబ్బతిందని వ్యాఖ్యానించడం పార్టీలో పెను ప్రకంపనలు సృష్టించింది. అధిష్టానం జోక్యం చేసుకుని ఆయనను బుజ్జగించడంతో రాజీనామా వెనక్కి తీసుకున్నప్పటికీ, పార్టీలో ఉన్న విభేదాలు మాత్రం సమసిపోలేదు. రాష్ట్ర యూనిట్‌లో గౌరవ్ గొగోయ్, రాకిబుల్ హుస్సేన్ వంటి ఇతర కీలక నేతల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుండటం వల్ల, ఎన్నికల నాటికి కేడర్ ఏకతాటిపైకి రావడం కష్టంగా కనిపిస్తోందకాంగ్రెస్ గెలుపుపై గట్టి ఆశలు పెట్టుకున్న కేరళలో, సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోశాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ అద్భుతమైన నాయకుడని, వచ్చే ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. సొంత కూటమి గెలుపు కోసం పోరాడాల్సిన సమయంలో, మిత్రధర్మాన్ని విస్మరించి ప్రత్యర్థిని కొనియాడటం కేడర్ మనోధైర్యాన్ని దెబ్బతీసింది.మణిశంకర్ అయ్యర్ కేవలం రాష్ట్ర రాజకీయాలకే పరిమితం కాకుండా, రాహుల్ గాంధీ నాయకత్వ శైలిని కూడా పరోక్షంగా విమర్శిస్తున్నారు. పార్టీలో జరుగుతున్న తప్పులను ఎత్తిచూపుతూనే, ఒక రకమైన నిరాశ ను తన మాటల్లో వ్యక్తం చేశారు. పార్టీలో ఉత్పన్నమవుతున్న ఇలాంటి అంతర్గత విభేదాలను, కీలక నేతల అసంతృప్తిని పరిష్కరించే ఒక శక్తివంతమైన ట్రబుల్ షూటర్ ' నాయకత్వ స్థాయిలో కనిపించకపోవడం కాంగ్రెస్‌కు ఉన్న అతిపెద్ద బలహీనతగా మారింది. మొత్తంగా చూస్తే, కాంగ్రెస్ పార్టీ బయటి శత్రువుల కంటే లోపల ఉన్న విభేదాల వల్లే ఎక్కువ నష్టపోతోంది. నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం, రాష్ట్ర స్థాయి నేతలు ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం ప్రయత్నించడం పార్టీని క్రమంగా బలహీనపరుస్తోంది. ఈ అంతర్గత చిచ్చును ఆర్పకపోతే, రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ తనను తాను ఓడించుకునే బాటలో పయనించడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# శశికళ కొత్త పార్టీ...



చెన్నై, ఫిబ్రవరి 17, (న్యూస్ పల్స్) తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు మొదలయ్యాయి. మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వి.కె. శశికళ 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సొంత పార్టీని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. అన్నాడీఎంకేలో తిరిగి చేరేందుకు ఆమె చేసిన ప్రయత్నాలను ఎడప్పాడి పళనిస్వామి వర్గం పూర్తిగా తిరస్కరించడంతో, ఆమె తన మద్దతుదారులతో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జయలలిత జయంతి రోజైన ఫిబ్రవరి 24, 2026న రామనాథపురం సమీపంలో శశికళ తన కొత్త పార్టీ పేరు , జెండాను ఆవిష్కరించే అవకాశం ఉంది. 2021 ఎన్నికల్లో రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించిన ఆమె, ఈసారి మాత్రం సుమారు 40 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుత అన్నాడీఎంకే నాయకత్వం ఎంజీఆర్ , జయలలిత ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని, పార్టీని మళ్లీ గాడిలో పెట్టడమే తన ఉద్దేశమని ఆమె అనుచరులు పేర్కొంటున్నారు. అవినీతి కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవించిన శశికళకు ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో ఇప్పటికీ సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయి.ఆమె అనర్హత కాలం వచ్చే ఏడాది ప్రారంభంలో ముగుస్తుంది, కాబట్టి ఆమె ఈ ఏడాది ఎన్నికల్లో నేరుగా పోటీ చేసే అవకాశం లేదు. అయినప్పటికీ, పార్టీని నడిపించడం , తన మద్దతుదారులను బరిలోకి దింపడం ద్వారా తన రాజకీయ బలాన్ని నిరూపించుకోవాలని ఆమె భావిస్తున్నారు. శశికళ కొత్త పార్టీ వల్ల ప్రధానంగా అన్నాడీఎంకే కే ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణ తమిళనాడులో బలమైన పట్టున్న తేవర్ సామాజిక వర్గం ఓట్లు అన్నాడీఎంకే నుండి శశికళ వైపు మళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే విజయ్ పార్టీ ఎంట్రీతో తమిళ రాజకీయాలు వేడెక్కగా, ఇప్పుడు శశికళ రంగంలోకి రావడం వల్ల ఓట్లు మరింతగా చీలిపోనున్నాయి. ఇది పరోక్షంగా అధికార డీఎంకే కు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.శశికళ ప్రకటన అన్నాడీఎంకేలోని ఈపీఎస్ వర్గానికి పెద్ద సవాలుగా మారింది. ఇప్పటికే ఓ. పన్నీర్ సెల్వం, టీటీవీ దినకరన్ వంటి నేతలు విడిపోయి ఉన్న తరుణంలో, శశికళ సొంత కుంపటి పెట్టడం వల్ల పార్టీ సంస్థాగతంగా మరింత బలహీనపడవచ్చు. అవినీతిపరులను పార్టీలోకి చేర్చుకోము అని పళనిస్వామి గట్టిగా చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కేడర్ విడిపోవడం ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపవచ్చు. తమిళనాడు రాజకీయాల్లో ఈసారి ద్విముఖ పోరాటం కాకుండా, డీఎంకే కూటమి, అన్నాడీఎంకే కూటమి, విజయ్-శశికళ వంటి చిన్న పార్టీల మధ్య బహుముఖ పోటీ సాగనుంది. శశికళ కేవలం 40 సీట్లలోనే ప్రభావం చూపినప్పటికీ, అన్నాడీఎంకే గెలుపోటములను శాసించే శక్తిగా మారే అవకాశం ఉంది. జయలలిత వారసురాలిగా ఆమెకు ఉన్న గుర్తింపు ప్రజల్లో ఎంతవరకు పనిచేస్తుందనేది 2026 అసెంబ్లీ ఎన్నికలే తేల్చాలి.

## జీవన్ రెడ్డికి కాంగ్రెస్ షాక్..

కరీంనగర్, ఫిబ్రవరి 17, జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం కోసం కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాలు తీవ్రంగా ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లు తమ వర్గానికి చెందిన వారికే చైర్మన్ పదవి ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో కాంగ్రెస్ పెద్దలు రంగంలోకి వారి మధ్య సయోధ్య కుదర్చేందుకు చర్చలు జరిపారు. చివరికి కాంగ్రెస్ అధిష్టానం ఆ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డికి బిగ్ షాకిచ్చింది. జగిత్యాల చైర్మన్ పీఠం సంజయ్ వర్గానికే కట్టబెడుతూ నిర్ణయించింది.జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలంటే కనీసం 25 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 23 చోట్ల, స్వతంత్రులు 15 చోట్ల గెలుపొందారు. బీజేపీ ఆరు, బీఆర్ఎస్ నాలుగు, ఎంఐఎం రెండు స్థానాలు గెలుచుకుంది.కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గం నుంచి 33 మంది పోటీ చేయగా 14మంది, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వర్గం నుంచి 17 మంది పోటీ చేయగా తొమ్మిది మంది విజయం సాధించారు. స్వతంత్రుల్లో తొమ్మిది మంది జీవన్ రెడ్డి వర్గం కాగా.. నలుగురు ఎమ్మెల్యే వర్గీయులు, ముగ్గురు బీజేపీ రెబల్స్ ఉన్నారు.ఈ క్రమంలో చైర్మన్ పీఠం కోసం జీవన్ రెడ్డి, సంజయ్ కుమార్ పోటీ పడ్డారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దలు రంగంలోకి దిగారు. జీవన్ రెడ్డితో పలు దఫాలుగా చర్చలు జరిపారు. ఈ చర్చల్లో భాగంగా సంజయ్ వర్గానికి చైర్‌పర్సన్ పదవి అప్పగించేందుకు నిర్ణయించారు.జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ గా సంజయ్ వర్గానికి చెందిన సమిండ్ల వాణిని కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసింది. భవిష్యత్తులో జడ్పీటీసీ, మార్కెట్ కమిటీ పదవుల విషయంలో ప్రాధాన్యత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ పెద్దలు జీవన్ రెడ్డికి హామీ ఇవ్వడంతో ఆయన వెనక్కు తగ్గినట్లు తెలిసింది. దీంతో గత రెండు రోజులుగా జీవన్ రెడ్డి వర్సెస్ సంజయ్ కుమార్ మధ్య జరుగుతున్న వార్ లో పార్టీ పెద్దలతో సహకారంతో సంజయ్ కుమార్ పంతం నెగ్గించుకున్నట్లయింది.

# రాజకీయ రొచ్చులోకి హీరోయిన్లు

# తెలంగాణలో రకుల్.. తమిళంలో త్రిష





చెన్నై, ఫిబ్రవరి 17, అమ్మ, ఆలి, చెల్లి... ఆడవాళ్ళ ప్రస్తావన లేకుండా తిట్టు చూద్దాం అని ఓ సినిమాలో విలన్‌కు సవాల్ విసురుతాడు హీరో. ఇప్పుడు రాజకీయ నాయకులకు సైతం ఈ విధమైన సవాల్ విసరాలేమో!? హీరోయిన్లను అడ్డు పెట్టుకుని విమర్శలు వద్దని, కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితం కావాలని! ఎందుకంటే... తెలంగాణలో రకుల్ ప్రీత్ సింగ్, తమిళనాడులో త్రిషను కొందరు నేతలు తమ స్వార్థం కోసం రాజకీయాల్లోకి లాగుతూ ప్రత్యర్థి పార్టీ నాయకులను టార్గెట్ చేశారు.త్రిషకు, రాజకీయాలకు సంబంధం లేదు. ప్రత్యేక్షంగా ఎవరికీ, ఏ రాజకీయ పార్టీకి త్రిష మద్దతు ఇచ్చిన సందర్భాలు లేవు. కానీ, ఇప్పుడు తమిళ రాజకీయాలు ఆమె చుట్టూ తిరుగుతున్నాయి. అందుకు కారణం కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పార్టీ స్థాపించి రాజకీయాల్లోకి రావడం.తమిళ రాజకీయాల్లో తాను ఒంటరిగా పోటీ చేస్తానని దళపతి విజయ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో మిగతా రాజకీయ పార్టీలు ఆయనపై కత్తి కట్టాయి. అది సహజం. విజయ్ 'జన నయగన్' విడుదలకు అడ్డంకులు ఏర్పడ్డాయి. అందులో రాజకీయ కోణం చూస్తున్నారు కొందరు. నిజానిజాలు పక్కన పెడితే... విజయ్ వరకు సంబంధించిన వ్యవహారం అది.విజయ్ మీద విమర్శలు గుప్పించే క్రమంలో తమిళనాడు భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ ఓ అడుగు ముందుకేసి... త్రిష ఇంటి నుంచి విజయ్ బయటకు రావాలని కామెంట్ చేశారు. ఆయన వ్యాఖ్యలపై విజయ్ - త్రిష అభిమానులు, మహిళా సంఘాలు భగ్గుమన్నాయ్. తెలంగాణలోనూ ఈ విధమైన నీచ రాజకీయాలు ఇటీవల జరిగాయి.భారతీయ రాష్ట్ర సమితి నాయకుడు, కేసీఆర్ తనయుడు కల్వకుంట్ల తారక రామారావు (కేఆర్ఆర్)కు, కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్‌కు ముడి పెడుతూ విమర్శలు చేశారు, ఇంకా చేస్తున్నారు ప్రత్యర్థులు. ఆ మధ్య సమంత వ్యక్తిత్వాన్ని తక్కువ చేసేలా విమర్శలు చేసి తర్వాత క్షమాపణలు చెప్పారు కొండా సురేఖ. తెలంగాణ రాజకీయ విమర్శల్లో అప్పుడప్పుడూ సురేఖా వాణి పేరూ వినిపిస్తూ ఉంటుంది. ఆ మధ్య తమిళనాడు రాజకీయాల్లో ప్రదీప్ రంగనాథన్ 'డ్రాగన్', విశ్వక్ సేన్ 'ఫంకీ' హీరోయిన్ కయాదు లోహర్ పేరు హైలైట్ అయ్యింది. ఎందుకు? రాజకీయాల్లో హీరోయిన్లను టార్గెట్ చేయడం ఎందుకు? ఇప్పుడు చిత్ర పరిశ్రమ నుంచి కాదు... సామాన్యుల నుంచి వ్యక్తం అవుతున్న ప్రశ్న. విలువలతో కూడిన రాజకీయాలను కొందరు ఎప్పుడో వదిలేశారు. కనీసం ఆడవాళ్లను తీసుకు రాకుండా రాజకీయాలు చేయలేరా? సినిమాల్లో విజయ్ - త్రిషది హిట్ పెయిర్. కొన్ని సినిమాలు చేసిన హీరో హీరోయిన్ల మధ్య పరిచయం ఉంటుంది. సినిమాల్లో ఉన్నట్టు బయట ఉంటారని విమర్శలు చేయడం ఎంత వరకు సబబు? అసలు రాజకీయాలతో సంబంధాలు లేని రకుల్ పేరు లాగడం ఎందుకు??తమిళనాడులో త్రిష... తెలంగాణలో రకుల్... రాజకీయాలకు సాఫ్ట్ టార్గెట్ కింద మారారు. సినిమాల్లో నటించడం, తమ పని ఏదో తాము చూసుకోవడం తప్ప ఈ తరహా రాజకీయ విమర్శలకు బదులు ఇవ్వరు. ఒకవేళ ఇస్తే మళ్ళీ మళ్ళీ వచ్చే రాజకీయ విమర్శలు అన్నిటికీ బదులు ఇవ్వవలసి ఉంటుంది. అందుకని, త్రిష - రకుల్ మౌనం వహిస్తున్నారు. విమర్శలను వాదిస్తున్నారు. దాంతో కొందరు రాజకీయ నాయకులు - వాళ్ళ అనుచరులకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో హీరోయిన్లపై వ్యక్తిత్వ దాడి కొనసాగిస్తోంది. దీనికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

# రాజకీయామా నీదే పార్టీ

హైదరాబాద్, ఫిబ్రవరి 17, తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత విచిత్రమైన , ఆసక్తికరమైన సమీకరణాలకు తెరలేపాయి. సిద్ధాంతపరంగా బద్ధశత్రువులుగా కనిపించే పార్టీలు క్షేత్రస్థాయిలో అధికారం కోసం చేతులు కలపడం 'అవకాశవాద రాజకీయం'గా కనిపిస్తున్నా, దీని వెనుక లోతైన వ్యూహాలు దాగి ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల కంటే స్థానిక గెలుపు గుర్రాలే కీలకం కావడంతో చాలా చోట్ల అనూహ్య పొత్తులు కనిపించాయి. బీజేపీ-కాంగ్రెస్, బీఆర్ఎస్-బీజేపీ వంటి అసంభవమైన కలయికలు కొన్ని మున్సిపాలిటీల్లో అధికార పీఠాలను కైవసం చేసుకున్నాయి. నిజామాబాద్ వంటి చోట్ల కాంగ్రెస్-మజ్లిస్ జతకట్టడం గమనార్హం. రాష్ట్ర స్థాయిలో నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నా, స్థానిక కౌన్సిలర్లు మాత్రం తమ ఉనికిని కాపాడుకోవడానికి పార్టీల మధ్య ఉన్న గీతలను చెరిపివేశారు.బీఆర్ఎస్ నేత హరీష్ రావు వంటి వారు ఇతర పార్టీల అనైతిక పొత్తులపై విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ, స్థానిక సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. గ్రామీణ , పట్టణ స్థానిక సంస్థల్లో నాయకత్వం వ్యక్తిగత ప్రాబల్యంపై ఆధారపడి ఉంటుంది. అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల నాటికి ఈ సమీకరణాలు మారిపోయి, మళ్ళీ ఆయా పార్టీల అధిష్టానాల ఆదేశాల మేరకు రాజకీయాలు నడుస్తాయి. అయితే ఈ మున్సిపల్ ఎన్నికలు పార్టీల మధ్య ఉన్న రాజకీయ అంటరానితనం పోయిందని స్పష్టం చేశాయి.ఈ ఎన్నికల తర్వాత అత్యంత ఆసక్తికరమైన చర్చ బీజేపీ - బీఆర్ఎస్ పొత్తు గురించి మొదలైంది. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవాలంటే ఈ రెండు పార్టీలు కలవడం ద్వారా ఓటు బ్యాంక్ ఏకీకరణ జరుగుతుందని ఒక వర్గం అభిప్రాయపడుతోంది. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల ఓట్ షేర్ కలిపితే అది అధికార పార్టీ కంటే ఎక్కువగా ఉండటమే ఈ చర్చకు ప్రధాన కారణం. కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి ఈ రహస్య లేదా బహిరంగ పొత్తు మున్సిపల్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి వెళ్లే అవకాశం ఉందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో, బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పట్టును కలిపితే బలమైన శక్తిగా ఎదగవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, ఉమ్మడి శత్రువును ఓడించడానికి రెండు పార్టీలు చేతులు కలపడం వ్యూహాత్మకంగా లాభిస్తుంది. అయితే, ఈ పొత్తు వల్ల ఇరు పార్టీల సిద్ధాంతాలకు తూట్లు పొడిచినట్లవుతుందనే భయం కూడా నాయకత్వాల్లో ఉంది. మైనారిటీ ఓట్లు కోల్పోతామనే భయం బీఆర్ఎస్‌కు ఉంటే, హిందుత్వ ఓటు బ్యాంకులో చీలిక వస్తుందేమోనన్న ఆందోళన బీజేపీలో ఉంది.రాబోయే రోజుల్లో ఈ రెండు పార్టీలు పొత్తుల గురించి ఆలోచన చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎందుకంటే, తెలంగాణలో కాంగ్రెస్‌ను ఒంటరిగా ఢీకొట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టతరమని ఈ మున్సిపల్ ఫలితాలు నిరూపించాయి. రాష్ట్ర స్థాయి రాజకీయం ఎప్పుడూ అధికారం చుట్టూనే తిరుగుతుంది కాబట్టి, భవిష్యత్తులో బీజేపీ-బీఆర్ఎస్ కలిసి పనిచేయడం అనేది అసాధ్యమేమీ కాదు. అయితే అది బహిరంగ పొత్తుగా ఉంటుందా లేదా లోపాయికారి ఒప్పందంగా ఉంటుందా అనేది కాలమే నిర్ణయించాలి.

## 15 ఏళ్ల అమ్మాయిలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

హైదరాబాద్, ఫిబ్రవరి 17,మీకు 14 ఏళ్లు నిండి 15 ఏళ్ల వయసున్న అమ్మాయిలు ఉన్నారా? అయితే మీకో అలర్ట్. త్వరలోనే తెలంగాణ ప్రభుత్వం మీ అమ్మాయిలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను వేయించనుంది. రాష్ట్రంలో మొత్తం 4 లక్షల మందికిపైగా ఈ వయసు ఉన్న కిశోర బాలికలు ఉన్నారని గుర్తించారు. వీరందరికీ టీకాలు వేయనున్నారు. అసలు ఈ వ్యాక్సిన్ ఎందుకు వేయిస్తారు..మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 14 నుంచి 15 ఏళ్ల వయసున్న బాలికల కోసం కేంద్రంతో కలిసి ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్‌ను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ వయసున్న బాలికలు రాష్ట్రంలో 4 .60 లక్షల మంది వరకు ఉంటారని అంచనా. వ్యాక్సినేషన్ చేపట్టడానికి ముందు మైక్రో ప్లానింగ్ సర్వే నిర్వహించనున్నారు. దీని ద్వారా ఈ వయసున్న అమ్మాయిలు స్కూళ్లలో ఎంత మంది ఉన్నారు, బయట ఎంత మంది ఉన్నారనే వివరాలను సమగ్రంగా సేకరిస్తారు.తెలంగాణలోని క్యాన్సర్ కేసులను పరిశీలిస్తే.. మహిళల్లో ఎక్కువ మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడుతుండగా.. ఆ తర్వాతి స్థానంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఉంది. దీన్నే సర్వైకల్ క్యాన్సర్ అని పిలుస్తారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా సర్వైకల్ క్యాన్సర్‌ను సమర్థవంతంగా అడ్డుకోవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. మహిళలకు సోకే సర్వైకల్ క్యాన్సర్లలో 85 నుంచి 90 శాతం హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వల్లే సోకుతోంది.ఎక్కువసార్లు ప్రసవాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, చిన్న వయసులోనే పెళ్లి కావడం, లైంగిక సంబంధాల వల్ల హ్యూమన్ పాపిలోమా వైరస్ సోకుతుంది. అయితే ఇది సోకిన వెంటనే క్యాన్సర్ రాదు. వైరస్ సోకిన 10-15 ఏళ్ల తర్వాత మహిళల్లో క్యాన్సర్ బయటపడుతుంది. దీంతో అమ్మాయిలు యుక్త వయసులోకి వచ్చిన తర్వాత, లైంగిక జీవితాన్ని ప్రారంభించడానికి ముందు హెచ్‌పీవీ టీకాలు వేయిస్తే.. క్యాన్సర్‌ను అరికట్టడంలో మంచి ఫలితం ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు.సర్వైకల్ క్యాన్సర్ తొలి దశలో ఎలాంటి లక్షణాలు కనిపించవు అందుకే దీన్ని సైలెంట్ కిల్లర్ అని పిలుస్తారు. వ్యాధి ముదురుతున్న కొద్దీ లక్షణాలు ఒక్కొక్కటిగా బయటపడతాయి. వ్యాధి బారిన పడ్డామని గ్రహించేలోపే అది ముదిరిపోతోంది. దీని వల్ల చికిత్స ఖర్చు పెరిగిపోవడంతోపాటు ప్రాణాలు కాపాడటం కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి కిశోర బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వడం ఉత్తమ పరిష్కారంగా డాక్టర్లు చెబుతున్నారు. 30 ఏళ్ల వయసు దాటిన మహిళలు క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచిస్తున్నారు.హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను బయట కొనుగోలు చేయాలంటే.. ఒక్కో డోసుకు కనీసం రూ.2 వేల నుంచి గరిష్టంగా రూ.4 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. 15 ఏళ్లు వచ్చిన అమ్మాయిలకు మూడు డోసుల వ్యాక్సిన్ ఇస్తారు. ఇది తల్లిదండ్రులకు ఆర్థికంగా భారం అవుతుంది. దీంతో ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించుకుంది. ఇందుకోసం వైద్య ఆరోగ్య శాఖ ఇప్పటికే ఏర్పా?ట్లు పూర్తి చేసింది. టీకాలు పంపిణీ చేసే సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు.

# 3 నగరాల్లో ఫుడ్ స్ట్రీట్స్...

వరంగల్ ఫిబ్రవరి 17, తెలంగాణలోని హన్మకొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల ప్రజలకు గుడ్ న్యూస్. సాయంత్రం కుటుంబంతో కలిసి స్ట్రీట్ ఫుడ్‌ను ఎంజాయ్ చేసేలా ఈ మూడు నగరాల్లో త్వరలోనే హెల్తీ అండ్ హైజినిక్ ఫుడ్ స్ట్రీట్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే దీని కోసం స్థలాల అన్వేషణ పూర్తి కాగా.. త్వరలోనే మిగతా ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ఫుడ్ స్ట్రీట్లలో స్టాల్స్ ఏర్పాటు చేయాలని భావించే వారు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.చాలా మందికి స్ట్రీట్ ఫుడ్ అంటే ఇష్టం. సాయంత్రం అయితే చాలు బజ్జీలు, పునుగులు, పానీపూరీ.. ఇలా ఏదో ఒకటి లాగించకపోతే మనసు ఊరుకోదు. అయితే వాటిని తయారు చేయడానికి ఎలాంటి పదార్థాలు వాడుతున్నారు? వాటిని విక్రయించే ప్రదేశాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంటాయో లేవో అనే భయం చాలా మందికి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రజలకు హైజనిక్ స్ట్రీట్ ఫుడ్ అందేలా చూడటం కోసం కేంద్రం ప్రభుత్వం కీలక ప్రయత్నం చేస్తోంది. దేశవ్యాప్తంగా 100 హెల్తీ అండ్ హైజినిక్ ఫుడ్ స్ట్రీట్లను ఏర్పాటు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే 86 సెంటర్లకు అనుమతులు ఇచ్చింది. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా ఒక్కో సెంటర్ కోసం కోటి రూపాయలు చొప్పున నిధులు మంజూరు చేస్తోందిఈ క్రమంలోనే తెలంగాణలోని హనుమకొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల్లో హెల్తీ అండ్ హైజనిక్ ఫుడ్ స్ట్రీట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఈ నగరాల్లో ఫుడ్ స్ట్రీట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను సైతం గుర్తించారు. సామాన్య ప్రజలు ఆహారం క్వాలిటీ గురించి, అందులో వాడిన పదార్థాల గురించి ఎలాంటి భయం లేకుండా.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఫుడ్‌ను ఎంజాయ్ చేసేలా ఫుడ్ స్ట్రీట్స్ ఉంటాయి. దుమ్ము ధూళితో ఇబ్బంది లేకుండా చూడటం కోసం, సులభంగా శుభ్రం చేసేందుకు వీలుగా ఫుడ్ స్ట్రీట్స్ ప్రాంగణం మొత్తం టైల్స్ వేస్తారు. రాత్రి టైంలో ఆకర్షణీయమైన లైటింగ్‌ను సైతం ఏర్పాటు చేయనున్నారు.

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్ ఉన్న వారికి మాత్రమే ఫుడ్ స్ట్రీట్స్‌లో స్టాల్స్ కేటాయిస్తారు. ఈఖూాంఎ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూస్తారు. ఆహార పదార్థాలను ఎలా జాగ్రత్తపర్చాలి, పరిశుభ్రంగా ఎలా ఉండాలనే విషయమై వెండర్లకు ట్రైనింగ్ కూడా ఇవ్వనున్నారు. ఈ స్టాల్స్‌లో వంట చేసే వారు, ఆహారాన్ని అందించేవారు తప్పనిసరిగా చేతులకు గ్లోవ్స్ పెట్టుకోవాలి. వెంట్రుకలు ఆహారంలో పడకుండా తలకు ఆప్రాన్ పెట్టుకోవాలి. గోర్లు పెంచుకోవడం, వేళ్లకు ఉంగరాలు పెట్టుకోవడం కుదరదు. పొగాకు నమలడం, సిగరెట్లు, బీడీలు కాల్చడం నిషేధం. ఆహార పదార్థాల తయారీకి వాడే ముడిసరుకులతోపాటు, ఫుడ్ ఐటెమ్స్ క్వాలిటీని ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తారు.అంతే కాదు ఈ ఫుడ్ స్ట్రీట్స్‌లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి కస్టమర్లు తాగడానికి శుద్ధ జలాన్ని అందిస్తారు. చేతులు శుభ్రం చేసుకోవడానికి ప్రత్యేకంగా వాష్ ఏరియాలు ఉంటాయి. ఫ్యామిలీతో సరదాగా టైం గడుపుతూ, ఫుడ్‌ను ఎంజాయ్ చేయడం కోసం బెంచీలను ఏర్పాటు చేస్తారు.

# ఆర్గానిక్ వస్తువుల కోసం యాప్

హైదరాబాద్, ఫిబ్రవరి 17, బి: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. సేంద్రియ ఉత్పత్తులకు ప్రత్యేక యాప్ తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం యాప్‌ను సిద్ధం చేస్తోంది. నకిలీల నుంచి విముక్తి కల్పించేలా యాప్ తీసుకొస్తున్నారు. ఈ యాప్‌లో సమగ్ర సమాచారం ఉండేలా ప్లాన్ చేశారు. అటు రైతులు, ఇటు ప్రజలకు ఉపయోగంగా ఉండేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే ఈ యాప్ అందుబాటులోకి వస్తుంది అంటున్నారు.తెలంగాణలో రైతులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. కొంతకాలంగా ప్రజలు ఆర్గానిక్ ఉత్పత్తులు ఉపయోగిస్తున్నారు.. కొంతకాలంగా విక్రాలు కూడా పెరిగాయి. ఇదే క్రమంలో ఆర్గానిక్ పేరుతో నకిలీవి కూడా మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.. అసలు ఏదో, నకిలీవి ఏవో తెలియడం లేదు.. రైతులు కూడా ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. ఓ యాప్‌ను తీసుకొస్తోంది. త్వరలోనే ఆర్గానిక్ యాప్‌ను సిద్ధం చేస్తామని అధికారులు చెబుతున్నారు. రైతులు వారి ఉత్పత్తులతో ఆదాయం పెంచుకునేందుకు ఈయాప్ ఎంతో ఉపయోగంగా ఉంటుంది. సాగును ప్రోత్సహించేందుకు రాయితీలూ ఇవ్వనుంది.తెలంగాణలో 50వేల ఎకరాల్లో 10వేలమంది వరకు రైతులు ఆర్గానిక్ వ్యసాయం చేస్తున్నారు. వరితో పాటుగా కూరగాయలు, నూనె గింజలు, పప్పుధాన్యాలు సాగు చేస్తున్నారు. మరికొందరు రైతులు పండ్ల తోటలు కూడా సాగు చేస్తున్నారు. రైతులు ఈ ఆర్గానిక్ సాగు కోసం ఎలాంటి పురుగుల మందు, ఎరువులు, ఇతర కెమికల్స్ ఉపయోగించరు. కేవలం జీవ పదార్థాలతో పంటల్ని సాగు చేస్తారు. అయితే పంట చేతికి వచ్చిన తర్వాత మార్కెటింగ్ ఎలా చేయాలో తెలియని పరిస్థితి. వీరు షాపులు, షాపింగ్ మాల్స్, షాపులకు ఈ ఉత్పత్తుల్ని పంపిస్తారు. ఆర్గానిక్ ఉత్పత్తుల్ని పెద్దగా ఎగుమతి కూడా చేయడం లేదు.ఆర్గానిక్ విత్తనాలు, ఉత్పత్తులకు 2015లో టీఎస్ఎస్‌వోసీఏ (తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ ప్రాధికార సంస్థ) ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆర్గానిక్ ఉత్పత్తుల కోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.. లైసెన్స్ వచ్చిన తర్వాత లేబుల్స్‌తో ఈ ఉత్పత్తుల్ని విక్రయించాల్సి ఉంటుంది. అయితే తెలంగాణలో 200 సంస్థలు లైసెన్సులు తీసుకున్నాయి. రైతులు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే చాలామంది రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడం లేదు. కొందరు రైతులు వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి సమస్యను వివరించారు. తాము నకిలీ ఉత్పత్తుల కారణంగా నష్టపోతున్నామని మంత్రికి ఫిర్యాదు చేశారు. దీంతో స్పెషల్‌గా యాప్ తీసుకురావాలని మంత్రి తుమ్మల సూచించారు. ఈ క్రమంలో యాప్‌ను సిద్ధం చేస్తున్నారు.టీఎస్ఎస్‌వోసీఏ (తెలంగాణ విత్తన, సేంద్రియ ధ్రువీకరణ ప్రాధికార సంస్థ) యాప్ ద్వారా సమాచారాన్ని పొందుపరుస్తారు. ఈ మేరకు రాష్ట్రంలో ఏ రైతు, ఏ పంట సాగు చేస్తున్నారో, ఎక్కడ సాగు చేస్తున్నారో, ఆ ఉత్పత్తులు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో వివరాలు అందుబాటులో ఉంటాయి. రైతుల సమాచారం (అడ్రస్, మొబైల్ నంబర్, ఫోటోలు, వీడియోలు) నమోదు చేస్తారు. ఈ యాప్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన యాప్‌ను కనెక్ట్ చేస్తారు. ఆర్గానిక్ ఉత్పత్తులు కొనుగోలు చేయడం.. ఎగమతుల సంస్థల వివరాలు కూడా ఉంటాయి. ఉత్పత్తులకు సంబందించిన వివరాలు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి.

# కేటీఆర్ మెడకు ఈ ఫార్ములా

హైదరాబాద్, ఫిబ్రవరి 17, ఇన్ని రోజులపాటు ఫోన్ ట్యాపింగ్ కేసును తెరపైకి తీసుకువచ్చి.. కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావు, కెసిఆర్ వంటి వారిని విచారించింది తెలంగాణ ప్రభుత్వం. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత.. అవన్నీ కూడా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వచ్చిన తర్వాత.. ఈసారి ప్రభుత్వం మరింత వేగంగా అడుగులు వేయడం మొదలుపెట్టింది.భారత రాష్ట్ర సమితిలో కార్య నిర్వాహక అధ్యక్షుడిగా కొనసాగుతున్న కేటీఆర్ పై మరింత ఒత్తిడి తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుం బిగించారు. కేటీఆర్ పురపాలక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఫార్ములా ఈ కార్ రేస్ జరిగింది. అందులో కుంభకోణం జరిగిందని.. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ కంపెనీకి.. తెలంగాణ ప్రభుత్వం నిధులు పంపించిందని.. ఇందులో చీకటి వ్యవహారం దాగి ఉందని ప్రస్తుత రేవంత్ సర్కార్ ఆరోపిస్తోంది.ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఇప్పటికే ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను విచారించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ కేసులో ఏసీబీ మరో రెండు రోజుల్లో ఛార్జ్ షీట్ దాఖలు చేస్తుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అరవింద్ కుమార్ ను విచారించడానికి కేంద్రం అనుమతి ఇవ్వడం విశేషం.2023లో హైదరాబాద్ నగరంలో ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహించారు. దీనికి సంబంధించి ఓ విదేశీ సంస్థకు నిబంధనలు పక్కనపెట్టి నిధులు చెల్లించారు. తద్వారా 54.88 కోట్ల నష్టం ప్రభుత్వానికి వాటిల్లిందని ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలోనే నాడు మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆదేశాలు జారీ చేయడం వల్లే విదేశీ సంస్థకు నిధులు మంజూరు చేశామని.. నాటి పురపాలకు శాఖ స్పెషల్ సెక్రెటరీ అరవింద్ కుమార్ ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా స్టేట్మెంట్ కూడా ఇచ్చారు.అప్పట్లో ఏసీబీ విచారణ నిర్వహించినప్పుడు అరవింద్ కుమార్ ఇదే విషయాన్ని అంగీకరించారు . ఈ కేసులో కేటీఆర్ ను విచారించడానికి గవర్నర్ గతంలోనే అనుమతి ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన తర్వాత.. ఆ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వచ్చిన తర్వాత.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖంగా ఈ కేసు మీద దృష్టి సారించినట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.ఇటీవల కాలంలో రేవంత్ రెడ్డికి అనేక సందర్భాలలో కేటీఆర్ సవాళు విసిరారు. పొట్టోడు అంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఈ కేసును తెరపైకి తీసుకొచ్చారని ప్రచారం జరుగుతుంది. అన్ని విధాలుగా పరిశీలించిన తర్వాత ఈ కేసును ప్రభుత్వం వ్యూహాత్మకంగా తెరపైకి తీసుకు వచ్చిందని తెలుస్తోంది. అయితే అరవింద్ కుమార్ ను విచారించిన తర్వాత.. కేటీఆర్ ను విచారిస్తారని.. అనంతరం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటుందని ప్రచారం జరుగుతోంది.

# లేగ దూడను చంపిన పులి

కుమురం భీం జిల్లా సిర్పూర్ టి మండలం ఇటికల పహాడ్ అటవీ ప్రాంతంలో హృదయాన్ని కదిలించే ఘటన చోటుచేసుకుంది. ఇటికల పహాడ్కు చెందిన నగోసే భీంరావు గారి ఆవు, దూడతో కలిసి మేత కోసం అటవీ ప్రాంతానికి వెళ్లింది. ప్లాంటేషన్ సమీపంలో అకస్మాత్తుగా పులి దాడి జరగగా, లేగ దూడ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.సాయంత్రం తల్లి ఆవు మాత్రం ఒంటరిగా ఇంటికి చేరింది. తన దూడ కోసం అటూ ఇటూ వెతుకుతూ, మౌనంగా విలపిస్తున్న ఆవును చూసి యజమాని హృదయం కలిచిపోయింది. అనుమానం కలిగిన భీంరావు గారు వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించారు.

ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. యజమాని ఆవును విడిచిపెట్టగా, ఆ తల్లి ఆవు ఎటువంటి సందేహం లేకుండా తన బిడ్డను కోల్పోయిన అదే ప్రదేశం వైపు నడిచింది. అధికారులు, సిబ్బంది ఆమె వెంబడి వెళ్లగా, పులి దాడి జరిగిన స్థలానికే ఆవు తీసుకెళ్లింది.చుట్టుపక్కల పరిశీలనలో పులి దాడి కారణంగానే దూడ మృతి చెందినట్లు నిర్ధారణ అయ్యింది. సంబంధిత అధికారుల తరఫున యజమానికి తక్షణ పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. అలాగే పశువుల కాపరులు దట్టమైన అటవీ ప్రాంతాల్లోకి వెళ్లకూడదని సూచనలు జారీ చేశారు.

## కాంగ్రెస్ పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నా జీవన్ రెడ్డి

జగిత్యాల భవిష్యత్ ఏంటో గోచరించట్లేదు, అవమానాలు ఇంకెంత కాలం భరించాలి. కాంగ్రెస్ పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నానని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. ఈ ఎన్నిక ముగింపు కాదు, ఎమ్మెల్యేగా సంజయ్ ఉన్నంత కాలం నాకు వేధింపులు తప్పవు. పవర్ ఆఫ్ అటార్నీ ఎమ్మెల్యే సంజయ్కు రాసిచ్చారా? బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు జగిత్యాల కాంగ్రెస్ పట్టా రాసిచ్చారని ఆరోపించారు. స్పీకర్ ఏమో ఎమ్మెల్యే పార్టీ మారలేదు అంటున్నాడు.. ఎమ్మెల్యే సంసారం మాత్రం కాంగ్రెస్ పార్టీతో చేస్తున్నాడు. అధినాయకత్వం కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలు గౌరవించాలి. జగిత్యాలలో ఇలా ఉంటే పార్టీ మారిన మరో తొమ్మిది

# గ్రేటర్ కోసం పక్కా వ్యూహం

హైదరాబాద్, ఫిబ్రవరి 17, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో ఇంట్రెస్టింగ్ డిస్కషన్‌కు దారితీశాయి. ఈ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చాలా సీరియస్‌గా ఫోకస్ చేసింది. ఎన్నికల సైరన్ మోగక ముందే..ఒక్కో పార్లమెంట్ సెగ్మెంట్‌కు మంత్రులను ఇంచార్జులుగా నియమించి..ఎప్పటికప్పుడు సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు చేశారు. ఎన్నికలు జరిగేంత వరకు సీరియస్‌గా ఫాలో అప్ చేయడంతో..మెరుగైన ఫలితాలు సాధించింది హస్తం పార్టీ.కొన్ని చోట్ల హంగ్ వచ్చిన వాటిని కూడా నయానో బయానో తమ ఖాతాలోకి వేసుకోగలిగింది కాంగ్రెస్. కానీ హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న మున్సిపాలిటీల్లో వచ్చిన రిజల్ట్స్ కాంగ్రెస్‌ను కలవరపెడుతున్నాయట. తాము సీరియస్‌గా ఎంత ఫోకస్ చేసినా..హైదరాబాద్ చుట్టూ ఉన్న మున్సిపాలిటీల్లో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేయడంతో..ఫలితాలు ఇలా ఎందుకు వచ్చాయని ఆరా తీస్తున్నారట హస్తం పార్టీ నేతలు.గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కలున్న నియోజకవర్గాల్లో కూడా ఖాతా తెరవలేకపోయింది. గ్రేటర్ పరిధిలోని 23 అసెంబ్లీ సెగ్మెంట్లతో పాటు పక్కనున్న చేవెళ్ల, మహేశ్వరం, మేడ్చల్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు పట్టం కట్టారు. దాంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక..గ్రేటర్ హైదరాబాద్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టి పనిచేస్తున్నారు హస్తం పార్టీ లీడర్లు.రాష్ట్రానికి గుండెకాయ లాంటి హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లో పట్టు సాధించేందుకు అన్ని అస్త్రాలను వాడుతున్నారు. హైదరాబాద్ విషయంలో పాలనా పరమైన సంస్కరణలు తీసుకొచ్చింది ప్రభుత్వం. ఔటర్ రింగ్ రోడ్డు వరకు హైదరాబాద్‌ను విస్తరించి ఉన్న ఏరియాను కోర్..రిజనల్ రింగ్ రోడ్డు వరకు విస్తరించి ఉన్న ప్రాంతాన్ని ప్యూర్, మిగతా తెలంగాణ ప్రాంతాన్ని రేర్‌గా విభజిస్తూ..పరిపాలనకు శ్రీకారం చుట్టింది. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు తోడుగా కొత్తగా ఫ్యూచర్ సిటీని డెవలప్ చేసే పనిలో పడింది.హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాలపై ఇంత ఫోకస్ పెట్టినా.. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆశించిన ఫలితాలు రాలేదు. ఎంతో గొప్పగా చెప్పుకునే ఫ్యూచర్ సిటీ ఏరియాలో ఉండే ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని కూడా కాంగ్రెస్ గెలుచుకోలేకపోయింది. ఇక్కడ బీఆర్ఎస్ మెజారిటీ సాధించింది. ఫ్యూచర్ సిటీకి పక్కనే ఉన్న కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమన్‌గల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ ఆధిక్యత ప్రదర్శించింది.కానీ బీఆర్ఎస్ కౌన్సిలర్‌ను తమవైపునకు తిప్పుకుని కారు పార్టీ నేతకు ఛైర్మన్ పోస్ట్ ఇచ్చి పరువు నిలబెట్టుకునే ప్రయత్నం చేసింది కాంగ్రెస్. అలాగే మేడ్చల్ జిల్లాలో ఉన్న మూడు మున్సిపాలిటీలు కూడా హస్తం పార్టీకి దక్కలేదు. మూడు చింతలపల్లి, ఎల్లంపేట్, అలియాబాద్ మున్సిపాలిటీలలో ఒక్క అలియాబాద్ మాత్రమే కాంగ్రెస్‌కు దక్కింది. మిగతా రెండుచోట్ల బీఆర్ఎస్ కైవసం చేసుకుంది.చేవెళ్ల నియోజకవర్గంలోని మొయినాబాద్‌లో మెజారిటీ లేకపోయినా..ఇండిపెండెంట్ అభ్యర్థులతో కలిసి పీఠాన్ని చేజిక్కించుకుంది కాంగ్రెస్. పటాన్ చెరు నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో కారు జోరు కాంగ్రెస్‌కు కంటిమీద కనుకు లేకుండా చేస్తోందట. ఇక పరిగి, వికారాబాద్ మున్సిపాలిటీలలో పూర్తిస్థాయి మెజారిటీ సాధించలేకపోయింది హస్తం పార్టీ.హైదరాబాద్ చుట్టుపక్కల చాలాచోట్ల ఇప్పటికీ పట్టు సాధించకపోవడంతో హస్తం పార్టీ నాయకత్వం ఆలోచనలో పడిందట. ఇంత చేసినా..మున్సిపాలిటీల్లో ఇలాంటి ఫలితాలు రావడంతో..అసంతృప్తితో ఉన్నారట. సిటీ శివారు ప్రాంతాల్లో వచ్చిన ఫలితాల ఎఫెక్ట్..రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎఫెక్ట్ పడే ప్రమాదం ఉందని భావిస్తున్నారట.జీహెచ్ఎంసీ ఎన్నికలకు రెడీ అవుతున్న కాంగ్రెస్ పార్టీని..హైదరాబాద్‌లో నాయకత్వం లేమి సమస్య ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దీన్ని అధిగమించేందుకు రాష్ట్ర నాయకత్వం ఒక ప్లాన్ చేస్తోందట. ఉఊఓఅ కాల పరిమితి ముగిసినా..ఆరు నెలల సమయం తీసుకొని..పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి..ప్రజల్లోకి వెళ్లాలనుకుంటుందట. ఆరు నెలల్లో పరిస్థితిని తమ ఆధీనంలోకి తెచ్చుకున్న తర్వాతే ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన చేస్తోందట హస్తం పార్టీ.గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం ఇప్పటికే కొన్ని సంస్కరణలు తీసుకొచ్చి..ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించి..మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. విభజిత జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లకు కూడా ఆరు నెలల తర్వాతే ఎన్నికలు పెట్టాలని చూస్తోంది. ఆరు నెలల తర్వాతైనా అధికార కాంగ్రెస్ పట్టు సాధిస్తుందా.? లేక పరిస్థితులు అనుకూలంగా లేవని కార్పొరేషన్ ఎన్నికలపై మళ్లీ ఆలోచనలో పడుతుందా అనేది వేచి చూడాలి.

# లిట్మస్ టెస్ట్... ఫెయిల్... ఎమ్మెల్యేలు పట్టు కోల్పోతున్నారా...

హైదరాబాద్, ఫిబ్రవరి 17, ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్టు.. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కొంతమంది ఎమ్మెల్యేలకు కష్ట కాలాన్ని తీసుకొచ్చింది. ఎందుకంటే మున్సిపల్ ఎన్నికలలో ఆ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో ప్రతికూల ఫలితాలు వచ్చాయి.

కాంగ్రెస్ పార్టీలో ఎవరంటే

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక్కడ 24 వార్డులలో కాంగ్రెస్ పార్టీ కేవలం ఎనిమిది మాత్రమే గెలిచింది. గులాబీ పార్టీ 13 స్థానాలలో విజయం సాధించింది.

మైనపల్లి రోహిత్ ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ నియోజకవర్గంలో మొత్తం 32 స్థానాలు ఉన్నాయి. ఇక్కడ గులాబీ పార్టీ 15 స్థానాలు సాధించింది. కాంగ్రెస్ పార్టీ 14 స్థానాలు దక్కించుకుంది.

తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ 15 వార్డులకు ఐదు మాత్రమే గెలిచింది. గులాబీ పార్టీ పది స్థానాలు దక్కించుకుంది. ఈ నియోజకవర్గంలో మందుల సామేల్ ఎమ్మెల్యేగా ఉన్నారు.

ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం లో బొజ్జు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ మున్సిపాలిటీలోని 12 వార్డులలో కాంగ్రెస్ పార్టీ కేవలం నాలుగు మాత్రమే గెలిచింది. దారుణంగా మూడో స్థానంలో నిలిచింది..

వర్ధన్నపేట నియోజకవర్గంలో కేఆర్ నాగరాజు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ 12 వార్డులకు కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి కంటే ఒక స్థానాన్ని తక్కువ గెలిచింది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ కేవలం ఐదు స్థానాలకు మాత్రమే పరిమితమైంది.

మంత్రి వివేక్ నియోజకవర్గమైన చెన్నూరులో క్యాతనపల్లి మున్సిపాలిటీలో గులాబీ పార్టీ అత్యధికంగా స్థానాలను సొంతం చేసుకుంది.

కల్వకుర్తి నియోజకవర్గంలో కాశిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యే గా ఉన్నారు. ఈ నియోజకవర్గం పరిధిలోని అమనగల్లులో 15 స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక వార్డు మాత్రమే గెలిచింది. కల్వకుర్తిలో మాత్రం కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ స్థానాలు రావడం విశేషం..

నారాయణపేట నియోజకవర్గం లో పర్ణిక రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ 24 వార్డులలో బిజెపి 11 గెలిచింది. కాంగ్రెస్ పార్టీ ఏడు మాత్రమే దక్కించుకుంది..

భారత రాష్ట్ర సమితిలో

జగదీష్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సూర్యాపేట నియోజకవర్గంలో 48 స్థానాల లో గులాబీ పార్టీ కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితమైంది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ 31 స్థానాలలో విజయం సాధించింది.

హుజురాబాద్ నియోజకవర్గం లో కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ 30 వార్డులు ఉంటే గులాబీ పార్టీకి కేవలం 8 స్థానాలు మాత్రమే లభించాయి.. ఇదే నియోజకవర్గంలో జమ్మికుంట మున్సిపాలిటీలో కాంగ్రెస్ కంటే గులాబీ పార్టీ రెండు ఎక్కువ వార్డులు సాధించి.. మొదటి స్థానంలో ఉంది.

డాక్టర్ సంజయ్ ఎమ్మెల్యే గా ఉన్న కోరుట్ల నియోజకవర్గం లో 33 వార్డులకు గానూ గులాబీ పార్టీ కేవలం 8 స్థానాలకు మాత్రమే పరిమితమైంది. మెట్ పల్లి నియోజకవర్గంలో కూడా గులాబీ పార్టీ రెండో స్థానంతో సరిపెట్టుకుంది.

జహీరాబాద్ నియోజకవర్గంలో మాణిక్ రావు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ గులాబీ పార్టీ కాంగ్రెస్ కంటే ఒక స్థానాన్ని తక్కువ దక్కించుకుంది. ఇక ఇదే నియోజకవర్గంలోని కోహిర్ ప్రాంతంలో 16 వార్డులు ఉంటే.. భారత రాష్ట్ర సమితి ఐదు స్థానాల వరకే ఆగిపోయింది.

సంగారెడ్డిలో చింత ప్రభాకర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ 38 వార్డులు ఉంటే.. కాంగ్రెస్ పార్టీ ఏకంగా 22 వార్డులలో విజయం సాధించింది. గులాబీ పార్టీ కేవలం పది స్థానాలతోనే సరిపుచ్చుకుంది. సదాశివపేట ప్రాంతంలో కూడా కాంగ్రెస్ పార్టీ ఏకంగా 16 స్థానాలను గెలుచుకోవడం విశేషం.

మల్లారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న మేడ్చల్ నియోజకవర్గంలో ఆలియాబాద్ మున్సిపాలిటీలో గులాబీ పార్టీ కేవలం ఏడు స్థానాల మాత్రమే సాధించింది. ఈ మున్సిపాలిటీలో 20 వార్డులు ఉన్నాయి. ఇక ఈ నియోజకవర్గంలోని ఎల్లంపేట, మూడు చింతలపల్లి మున్సిపాలిటీలలో మాత్రం గులాబీ పార్టీ అత్యధిక సీటు సాధించి.. గెలుపును సొంతం చేసుకోవడం విశేషం.

భారతీయ జనతా పార్టీలోబిజెపి ఎమ్మెల్యే శంకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదిలాబాద్ పురపాలకంలో బిజెపి ఎక్కువ వార్డులు సొంతం చేసుకుంది. ఇక్కడ 49 స్థానాలలో 21 స్థానాలను గెలుచుకుంది బిజెపి.

వేరేటి మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న నిర్మల్ లో కమలం పార్టీ 42 వార్డులకు గాను కేవలం 13 స్థానాల్లో మాత్రమే గెలుపు సాధించింది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ 24 స్థానాలను సొంతం చేసుకుంది.

రాకేష్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న ఆర్మూర్లో బిజెపి కేవలం ఎనిమిది వార్డులు మాత్రమే సొంతం చేసుకుంది. ఇక్కడ 36 వార్డులు ఉన్నాయి.

కాగజ్ నగర్ ఎమ్మెల్యేగా పాల్వాయి హరీష్ బాబు కొనసాగుతున్నారు. ఇక్కడ 30 వార్డులు ఉంటే.. బిజెపి కేవలం ఐదు స్థానాలు మాత్రమే గెలిచింది. దారుణంగా మూడవ స్థానానికి పరిమితం అయిపోయింది.

ముథోల్ నియోజవర్గంలో రామారావు ఎమ్మెల్యే గా ఉన్నారు. ఇక్కడి బైంసా మున్సిపాలిటీలో బిజెపి కేవలం ఆరు స్థానాలు మాత్రమే గెలిచింది.

కామారెడ్డి ఎమ్మెల్యేగా వెంకటరమణారెడ్డి కొనసాగుతున్నారు. ఇక్కడ 49 స్థానాలు ఉంటే.. కేవలం 16 స్థానాలు మాత్రమే గెలిచింది బిజెపి. కాంగ్రెస్ పార్టీ 19 స్థానాలను దక్కించుకుంది.

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి వ్యతిరేకంగా నినాదాలు

యాదాద్రి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి ఎదురు దెబ్బ తగిలింది. సొంత పార్టీ నాయకులే వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ చెర్మన్ అభ్యర్థుల సెలక్షన్లో తమకు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్యాయం చేశారని చౌటుప్పల్ లో ఆయనకు వ్యతిరేకంగా బత్తుల వాణి విప్లవ్ నినాదాలు చేసారు. పార్టీ ని నమ్ముకున్న వారికి ఎమ్మెల్యే తీవ్ర గా అన్యాయం చేశారని ఆరోపించారు. మేజారిటీతో గెలిచిన బత్తుల వాణి ని చెర్మన్ గా ప్రకటించాలని 13 వార్డు ప్రజలు డిమాండ్ చేశారు ....

# భర్తను కత్తితో నరికి చంపిన భార్య



మందమర్రి: ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తను భార్య కిరాతకంగా అంతమొందించిందిన భయానక ఘటన మంచిర్యాల జిల్లాలో ఇవాళ చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మందమర్రి పట్టణంలోని శాంతి నగర్‌కు చెందిన మోయిన్ , అవంతి గతంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లయిన కొత్తలో సజావుగానే సాగిన వీరి సంసారంలో కొద్దిరోజులుగా కలహాలు మొదలయ్యాయి.ఈ క్రమంలోనే ఇవాళ భార్యాభర్తల మధ్య గొడవ పెద్దదవ్వడంతో ఆవేశానికి లోనైన అవంతి, ఇంట్లోని కత్తితో భర్త మోయిన్‌పై విచక్షణారహితంగా దాడి చేసింది. తీవ్ర రక్తస్రావమైన మోయిన్‌ను గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, పరిస్థితి విషమించడంతో మోయిన్ అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. భర్త వేధింపులే ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మోయిన్, అవంతిది ప్రేమ వివాహం అయినప్పటికీ, మోయిన్ తరచూ తనను వేధించేవాడని, ఆ బాధ భరించలేకే భార్య అవంతి ఘాతుకానికి పాల్పడినట్లుగా ప్రచారం జరుగుతోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించిన పోలీసులు, నిందితురాలు అవంతిని అదుపులోకి తీసుకోనున్నారు.

## ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గా..
## ఇండిపెండెంట్ అభ్యర్థి అనూష బండారి ప్రమాణ స్వీకారం

ఆదిలాబాద్ జిల్లా: ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ గా ఇండిపెండెంట్ అభ్యర్థిని... అనూష బండారి మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికయ్యారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ ఎంఐఎం, ఇండిపెండెంట్ లు మొత్తం 27 కౌన్సిల్ మెంబర్లు ఓటు హక్కు వినియోగించి..45 వ వార్డు కౌన్సిలర్ అనూష ను మున్సిపల్ చైర్మన్ గా ఎన్నుకున్నారు. దీంతో అదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ ఉత్కంఠకు తెర వీడింది. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ 21/కాంగ్రెస్ 11 వార్డులలో విజయం సాధించగా... అధికార కాంగ్రెస్ పార్టీ.. తమ పార్టీ నుండి గెలిచిన వార్డు సభ్యులు 11 మంది తో కలిసి , ఎంఐఎం 6 గురు, స్వతంత్ర అభ్యర్థులు 4 గురు, బి.ఆర్.ఎస్.నుండి గెలిచిన 6 గురు వార్డు సభ్యులు స్వతంత్ర అభ్యర్థి అయిన బండారి అనూష కు మద్దతు ఇవ్వడంతో...ఆమె మున్సిపల్ చైర్మన్ గా ప్రమాణ స్వీకరణ చేశారు.. వైస్ చైర్మన్ గా ఏఐఎంఐఎం పార్టీ నుండి గెలిచిన వార్డు కౌన్సిలర్ మొహమ్మద్ రోహిత్ ప్రమాణ స్వీకరణ చేశారు

# సత్యవతి రాథోడ్ హౌజ్ అరెస్టు

మహబూబాబాద్ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదినం సందర్బంగా తన సొంతః మండలం కురవి మండల కేంద్రంలో అన్న దాన కార్యక్రమం నిర్వహించి పేద ప్రజలకు రోగులకు పండ్లు దుస్తులు పంపిణి చేయాలనీ నేడు మహబూబాబాద్ లొని తన నివాసం నుండీ బయలు దేరుతున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ను పోలిసులు హౌస్ అరెస్ట్ చేశారు .నేడు తోరూరు లో బీ ఆర్ ఏస్ పార్టీ బారి ధర్నా కార్యక్రమం నిర్వహించనుంది .దానిలో బాగంగానే అరెస్ట్ చేశామని పోలిసులు చెప్పుతున్నారు .ధర్నా కార్యక్రమంలో పాల్గొన కుండానే అరెస్ట్ చేయడం మరి దారుణమని తెలంగాణ ప్రజల అభిమాన నాయకుడు కెసిఆర్ జన్మదినం కూడా జరుపుకోనివ్వకుండా ధర్నా అనే సాకుతో అరెస్ట్ చేయడం చాల సిగ్గు మాలిన చర్య అనీ వెంటనె నన్ను విడుదల చేసి కెసిఆర్ జన్మ దిన వేడుకల్లో పాల్గొననివ్వలని నన్ను హౌస్ అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు

## మణికొండలో భారీగా పేలిన నీటి పైప్ లైన్:
## అపార్ట్మెంట్ సెల్లార్లలోకి చేరిన నీరు

హైదరాబాద్ హైదరాబాద్ శివారు మణికొండలో గల పైప్ లైన్ రోడ్లో భారీ నీటి పైప్లైన్ అర్ధరాత్రి ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ఘటన వల్ల భారీ ఎత్తున నీరు విడుదల కావడంతో సమీపంలో ఉన్న లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఐదు నిమిషాల వ్యవధిలోనే దాదాపు ఆరు అడుగుల మేర నీరు అపార్ట్మెంట్ సెల్లార్లలోకి చేరింది. అపార్ట్మెంట్లలో పార్క్ చేసిన దాదాపు 7 నుండి 8 కార్లు, ద్విచక్ర వాహనాలు నీటిలో మునిగిపోయి భారీగా దెబ్బతిన్నాయి. సెల్లార్లో ఉన్న వస్తువులు మరియు విద్యుత్ వ్యవస్థ కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. సమాచారం అందిన వెంటనే హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) బలగాలు, అగ్నిమాపక శాఖ మరియు స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పైప్లైన్ నీటిని వెంటనే నిలిపివేసి, సెల్లార్లలో ఉన్న నీటిని తోడే ప్రక్రియను ప్రారంభించారు. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు కానీ, స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు . అధికారులు తక్షణమే స్పందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మంత్రి వివేక్ వాహనంపై రాళ్ల దాడి



మంచిర్యాల క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీస్కు వస్తుండగా మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రయాణిస్తున్న వాహనంపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ రాళ్లు రువ్విన ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. ఈ దాడిలో వాహనం కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. సంఘటన సమయంలో అక్కడ ఉన్న కార్యకర్తలు, ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ప్రజా ప్రతినిధులపై ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## ఇబ్రహీంపట్నంలో భారీ బందోబస్తు

రంగారెడ్డి ఈరోజు చైర్మన్ ఎన్నిక ఇబ్రహీంపట్నం మున్సిపల్ జరుగుతున్న తరుణంలో పోలీస్ కట్టుదిట్టమైన ఏర్పాటు చేయడం జరిగింది. నిన్న జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకొని అల్లరి కాకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేయడం జరిగింది. మంగళవారం బందోబస్తు చాలా ఎక్కువగా ఉంది. ఎన్నికల కమిషనర్, జిల్లా ఎన్నికల అబ్జర్వర్ ప్రత్యేకంగా పది మంది ఏసీపీలు 30 మంది సిఐలు కనీసం ఒక మూడు నాలుగు వందల మంది పోలీస్ తో భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 24 వార్డులు. దీంట్లో 13 వార్డులకు టిఆర్ఎస్ కౌన్సిలర్ గెలవడం జరిగింది. రెండు బీజేపీ ఒక్క స్వాతంత్ర అభ్యర్థి అలాగే కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది గెలిచారు. అలాగే ఎక్స్ అఫీషియోగా స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి తమ ఓటు హక్కును ఇక్కడ నమోదు చేసుకున్నారు. ఇది ఇలా ఉండగా బిఆర్ఎస్ 13 మంది సభ్యుల్లో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అతని తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి సీతారంపేట గ్రామానికి చెందినసుదర్శన్ రెడ్డిని చైర్మన్గా చేయాలని నిర్ణయించుకున్నారు . టిఆర్ఎస్ నుంచి సీనియర్ నాయకుడు ఆకుల యాదగిరి నాకు చైర్మన్ పదవి కావాలని క్యాంపుకు వెళ్లిన తర్వాత పట్టుపడ్డాడు. యాదగిరికి చైర్మన్ పదవి ఇవ్వకుండా చేయాలని అతన్ని దాచిపెట్టి క్యాంపు కూడా టిఆర్ఎస్ వాళ్ళు తీసుకురావడం లేదని యాదగిరి కుటుంబ సభ్యులు నిన్న ఆందోళన చేసారు.

# కాంగ్రెస్, బీజేపీ దోస్తీ అనైతికం
# పద్మా దేవేందర్ రెడ్డి



మెదక్ ఢిల్లీలో కాంగ్రెస్, బిజెపి పార్టీలకు వైరమున్నా మెదక్ బల్దియాలో కాంగ్రెస్ ,బిజెపి, బీఎస్పీ సహకరించుకోవడం అనైతిక చర్య అని మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి విమర్శించారు.

బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిత్యం కాంగ్రెస్, బిజెపి నాయకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ... మెదక్ మున్సిపల్ పోరులో ఇరు పార్టీలు సహకరించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మరోసారి మెదక్ ప్రాంత ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని చెప్పారు. అభివృద్ధి పేరుతో ఎన్నికలు రాగానే ఇష్టం వచ్చిన వాగ్దానాలు చేస్తూ ప్రజలను ప్రలోభ పెడుతుందని గుర్తు చేశారు. ఎన్నికల్లో మద్యం ,డబ్బు ఏరులై పారిన ప్రభుత్వ అధికారులు, పోలీస్ శాఖ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల్లో అభ్యర్థులపై అట్రాసిటీ కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అభ్యర్థులను ప్రచారం చేయనీయకుండా చేశారని , కేవలం అధికారం కోసమే కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని , బిఆర్ఎస్ పై నమ్మకాన్ని ఉంచి కాంగ్రెస్ కన్నా అధిక స్థానాలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే సమయంలో మెదక్ లో అవినీతి జరగకుండా చూసే బాధ్యత కౌన్సిలర్ల పై ఉందని, వారికి బి ఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కెసిఆర్ ఆదేశాల మేరకు మెదక్ లో బిఆర్ఎస్ పార్టీ గట్టిగా పని చేసిందని అందుకే ప్రజలు ఆదరించి కాంగ్రెస్ కన్నా పెద్ద మెజార్టీతో సభ్యులను గెలిపించారని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మెదక్ పట్టణాభివృద్ధి కి కృషి చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ మాట్లాడుతూ కెసిఆర్ , హరీష్ రావు మెదక్ గురించి ముందే చెప్పారని, మెదక్ లో రౌడీయిజం నడుస్తుందని నివారించాలంటే బలంగా ప్రజలను ఏకం చేయాలని అన్నారని గుర్తు చేశారు. వార్డులో తిరుగుతుంటే ప్రజలే బిఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టారని రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీని ప్రజలు గుండెల్లో పెట్టుకొని చూస్తారని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ విపరీతమైన డబ్బులు , మద్యం పంచడంలో కాంగ్రెస్ పార్టీ ముందుందని విమర్శించారు. అట్రాసిటీ కేసుల పోలీస్ అధికారులు పెట్టడం సమంజసం కాదని అన్నారు. అధికార పార్టీకి పోలీసు అధికారులు ఇంతగా సహాయం చేయడం ఎక్కడ చూడలేదని విమర్శించారు. ప్రజలు విశ్వసించి కాంగ్రెస్ కన్నా ఎక్కువ మెజార్టీతో కౌన్సిలర్లను గెలిపించడం కాంగ్రెస్ కు బుద్ధి చెప్పినట్లేనని అన్నారు. మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు విశ్వసించి పూర్తి మెజార్టీతో బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పియడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కెసిఆర్ సూచన మేరకు హరీష్ రావు, పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ పనిచేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిని ఆకస్మిక తనికి చేసిన మంత్రి

సంగారెడ్డి విధులు నిర్లక్ష్యం వహించే వైద్యులను సస్పెండ్ చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట ఏరియా ఆసుపత్రినీ మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి విధులకు హాజరు కాని డాక్టర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రతి రోజు ఎన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు..? ఎంతమంది చేయించుకుంటున్నారు ... మందుల కొరత ఏమైనా ఉందా..? అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నుంచే వైద్య విధాన పరిషత్ రాష్ట్ర కమిషనర్ కు ఫోన్ చేసి మాట్లాడారు. జోగిపేట ఆసుపత్రి బాగు పడదా..? వైద్యుల్లో మార్పు రాదా. ఈ రోజు ఎంత మంది విధులకు రాలేదు వారందరినీ సస్పెండ్ చేయాలని ఆదేశించారు. రేపు నాకు రిపోర్ట్ చేయాలని డిసిహెచ్ ఎస్ కు ఫోన్ చేసి చెప్పాలని తెలిపారు.

# నల్గొండ పట్టణంలో దుకాణాలు,
# డివైడర్ల తొలగింపులు



నల్గొండ ను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడంలో భాగంగా జిల్లా కేంద్రానికి గుండెకాయలా ఉన్న ప్రకాశం బజార్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు తక్షణ చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.మంగళవారం ఉదయం 4 గంటల నుండే ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని లతీఫ్ సాబ్ గుట్ట, ప్రకాశం బజార్ తదితర ప్రాంతాలను సందర్శించారు.ప్రకాశం బజార్లో ఫుట్ పాత్ పై చిరు వ్యాపారులు , పూలు ,పండ్లు వ్యాపారాలు చేసుకునేవారు డివైడర్ మధ్యలో వాటిని ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రమాదాలు సంభవిస్తున్నాయని చాలా రోజుల నుండి ప్రజలు తన దృష్టికి తీసుకొస్తున్నట్లు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తక్షణమే డివైడర్లను తొలగించి అక్కడ వ్యాపారాలు నిర్వహించుకునే సుమారు 60 నుండి 70 మంది పూలు, పండ్లు, ఇతర చిరు వ్యాపారుల దుకాణాలన్నింటిని జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ కార్యాలయ స్థలంలోకి తరలించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అక్కడ వ్యాపారాలు నిర్వహించుకునెందుకు అనువైన స్థలం ఉందని, అంతేకాక పార్కింగ్ కి ఇబ్బంది లేదని, ప్రస్తుతం ప్రకాశం బజార్లో 60 నుండి 70 మంది చిరు వ్యాపారులు ఫుట్పాత్ పై వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారని, అలాంటి వారందరిని గుర్తించి వారికి పాత కలెక్టర్ కార్యాలయ స్థలంలో వారి షాపు పరిమాణాలను బట్టి 50, 70, 100 గజాల స్థలాలను కేటాయిస్తామని మంత్రి తెలిపారు.

పాత కలెక్టర్ కార్యాలయం స్థలంలో ప్రస్తుతం ఉన్న డీసీఎం పార్కింగ్ ను దేవరకొండ రోడ్ లోని హౌసింగ్ బోర్డ్ స్థలంలోకి తక్షణమే మార్చాల్సిందిగా ఆయన ఆదేశాలు జారీ చేశారు. ప్రకాశం బజార్ లోని డివైడర్లను జెసిబి లో సహాయంతో అప్పటికప్పుడే తొలగించే చర్యలను చేపట్టారు. సాయంత్రంలోగా డివైడర్ తొలగింపును పూర్తి చేయాలని, అదేవిధంగా పాత కలెక్టరేట్ స్థలంలో సీసీ వేయించి మార్కింగ్, లైనింగ్ ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. ప్రకాశం బజార్లో భూగర్భ ఎలక్ట్రిసిటీ తో పాటు, సిసి రోడ్డు కొత్తగా వేయిస్తామని, ఇకపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ రద్దీ లేకుండా ఉంటుందని అన్నారు.ఈ సందర్భంగా మంత్రి స్థానిక చిరు వ్యాపారుల తో మాట్లాడారు. వ్యాపారాలు నిర్వహించుకునే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటామని, ముఖ్యంగా పేదలకు ఎలాంటి ఇబ్బంది కలగనివ్వమని, అందరికీ షాపులను కేటాయించి ఉపాధి కల్పిస్తామని చెప్పారు.ఈ సందర్భంగా గులాం ఖాదర్ పండ్ల వ్యాపారి నుండి మంత్రి అప్పటికప్పుడే 30 వేల రూపాయలు చెల్లించి పండ్లను కొనుగోలు చేసి అందరికీ పంపిణీ చేశారు. ప్రకాశం బజార్లో సుమారు రోజు 10,000 మంది వ్యాపారం నిమిత్తం సందర్శిస్తుంటారని, గతంలో చిన్న వ్యాపారాలు, షాపులు ఉండేవని, ఎలాంటి రద్దీ ఉండేది కాదని జనాభా పెరగడం, వ్యాపారాలు పెరగడం వల్ల ప్రస్తుతం విపరీతమైన రద్దీ ఏర్పడి ట్రాఫిక్ తో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని డివైడర్ తొలగింపు, పూలు, పండ్ల వ్యాపారాలు, చిరు వ్యాపారులను పాత కలెక్టరేట్ కార్యాలయం స్థలంలోకి తరలించాలని చేపట్టినట్టు మంత్రి వెల్లడించారు. పేదవారికి ఎప్పుడు తాను సహాయం చేస్తానని, పేదల పక్షాన ఉంటానని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.

జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, నల్గొండ అశోక్ రెడ్డి, డిఎస్పి శివరామిరెడ్డి, ట్రాన్స్కో, మున్సిపల్, తదితర అధికారులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

# దళిత ఆత్మగౌరవ పతాక భాగ్యరెడ్డి వర్మ

## -నేడు భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి



భాగ్యరెడ్డి వర్మ (మాదరి బాగయ్య)
జననం: 22-05-1888, మరణం: 18-02-1939

దళితులు పంచములు కాదు.. ఆది హిందువులు అంటూనే జోగిని, దేవదాసి వంటి దురాచారాలను రూపుమాపేందుకు ఉద్యమించారు. మన్యం సంఘాన్ని స్థాపించి దళితుల్లో చైతన్యం తెచ్చారు. జగన్ మిత్ర మండలి పేరిట దళిత బాలబాలికలకు విద్య నేర్పించారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డారు. పలు సేవా కార్యక్రమాలతో దళిత జనోద్ధారకుడిగా, సంఘ సంస్కర్తగా, వైతాళికుడిగా నిలిచారు.. భాగ్యరెడ్డి వర్మ. మాదరి భాగయ్యగా జన్మించి.. సమాజ సేవా కార్యక్రమాలతో భాగ్యరెడ్డి వర్మగా ప్రసిద్ధి చెందిన ఆయన వర్ధంతి ఈ రోజు..నిజాం పాలిత హైదరాబాద్ రాజ్యంలో అనగారిన వర్గాల గొంతుక భాగ్యరెడ్డి వర్మ.. 1888 సం. మే 22 నాడు మాదిరి వెంకయ్య, రంగమాంబ దంపతులకు జన్మించారాయన.. తొలిపేరు భాగయ్య.. అయితే వారి కుల గురువు భాగ్యరెడ్డి అనే పేరు పెట్టారు.. (రెడ్డి అంటే పాలకుడు అనే అర్థం కూడా ఉంది) చిన్నప్పటి నుండి సామాజిక స్పృహను అలవరచుకున్న భాగ్యరెడ్డిపై ఆర్యసమాజం, బ్రహ్మసమాజం, బౌద్ధం ప్రభావం కూడా ఉంది. అంటరానితనం, దేవదాసీ వ్యవస్థ, మద్యపానం తదితర రుగ్మతలపై పోరాటాలు చేయడమే కాదు, స్వయంగా దళితులకు విద్య, ఉపాధి, సామాజిక హోదాల కోసం తన వంతు కృషి చేశారు. ఆయన సామాజిక సేవా కార్యక్రమాను చూసి ఆర్యసమాజం వర్మ అనే బిరుదును ఇచ్చింది.. అలా బాగ్యరెడ్డి వర్మ పేరు వచ్చింది.అంబేద్కర్ కన్నా ముందే దేశ వ్యాప్తంగా దళితులకు అనాదిగా జరుగుతున్న అన్యాయాలపై గొంతెత్తిన మహానాయకుడు భాగ్యరెడ్డి వర్మ.. తదనంతర కాలంలో బాబా సాహెబ్ తో కలసి ఉద్యమాల్లో పాల్గొన్నారు ' మేము పంచములం కాదు.. ఈ దేశ మూల వాసులం.. ఆది హిందువులం..' అని సగర్వంగా చాటారు.. అనగారిన కులాలను ఆది హిందువులు అని పిలవాలని పిలుపునిచ్చారు. భాగ్యరెడ్డి వర్మ సూచన మేరకు హైదరాబాద్, మద్రాసు ప్రభుత్వాలు వారిని ఆది హిందువులుగా గుర్తించాయి. ప్రారంభంలో జగన్ మిత్ర మండలి, ఆ తర్వాత కాలంలోఆది హిందూ మహా సభ పేరిట తన సేవా కార్యక్రమాలు నిర్వహించారు.. 1910లో చాదర్ఘాట్ దగ్గర ఆది హిందూ పాఠశాల ప్రారంభించారు. మహాత్మా గాంధీ ఈ పాఠశాలను సందర్శించారు. కాలక్రమంలో ఆది హిందూ పాఠశాలలు 26కు విస్తరించాయి.భాగ్యరెడ్డి వర్మ సేవలు హైదరాబాద్ (తెలంగాణ) సంస్థానానికే పరిమితం కాలేదు.. 1917లో విజయవాడలో అంటరాని కులాల సదస్సును నిర్వహించారు. ఆంధ్ర జిల్లాల్లో కూడా పర్యటించి అనగారిన వర్గాల్లో చైతన్యం తీసుకు వచ్చారు. లక్నో, అలహాబాద్, కలకత్తా తదితర ప్రాంతాల్లో జరిగిన దళిత చైతన్య మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. భాగ్యరెడ్డి వర్మ 1939 ఫిబ్రవరి 18న క్షయ వ్యాధితో కన్నుమూశారు. 51 ఏళ్లకే ఆయన అకాల మరణంతో ఆది హిందూ ఉద్యమం, అనగారిన వర్గాల అభివృద్ధి, అభ్యున్నతికి విఘాతం కలిగించింది. భాగ్యరెడ్డి వర్మ గారి వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలను గుర్తు చేసుకుందాం.

# కేసీఆర్ ఒక ఉద్యమం, ఒక విజన్, యుగ ప్రభంజనం హరీష్ రావు



హైదరాబాద్ కేసీఆర్ అనే మూడు అక్షరాలు జై తెలంగాణ యుద్ధ నినాదం, దశాబ్దాల ఆకాంక్షల ప్రతిధ్వని, తెలంగాణ ఆత్మగౌరవ గర్జన అని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ అంటే.. ఉద్యమ స్ఫూర్తికి ప్రతిరూపం, తెలంగాణ ప్రజల గుండెల్లో నిత్య సూర్యోదయం. కేసీఆర్ ఒక ఉద్యమం, ఒక విజన్, యుగ ప్రభంజనం. యావత్ తెలంగాణను ఏక తాటిపై నడిపి, ఉద్యమం పుట్టించి, ఆ ఉద్యమాన్ని రాష్ట్ర ఆవిర్భావంగా తీర్చిదిద్దిన దృఢసంకల్పం. మీ అడుగులు ఆత్మగౌరవ పోరాటానికి దారులు చూపాయని అన్నారు.

మీ ఆలోచనలు అణగారిన గుండెలకు ఆత్మబలాన్ని అందించాయి. మీ వ్యూహాలు ఆధిపత్య శక్తుల కుట్రల్ని పటాపంచలు చేశాయి. మీ పట్టుదల, మీ పరిణతి, మీ నిబద్ధత, మీ నిర్భీతి తరతరాల వివక్షా విద్రోహాల నుంచి తెలంగాణను విముక్తి చేశాయి. ప్రతి తరానికి ఒక టార్చ్బేరర్ ఉంటారు?కానీ తెలంగాణకే టార్చ్ బేరర్ మన కేసీఆర్. నా జీవిత ప్రయాణంలో మీరు కేవలం నా మేనమామ మాత్రమే కాదు.. అంతకు మించి నా సర్వస్వం. మేనమామగా ఆశీర్వదించి అపారమైన ప్రేమను పంచారు. రాజకీయంగా నాకు ఓనమాలు దిద్దించి విలువలు నేర్పించి ప్రజా సేవలో నన్ను తీర్చిదిద్దారని అన్నారు.

ఉద్యమనిర్మాతగా ప్రగతి ప్రదాతగా దేశచరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించుకున్న మీ జన్మదినం తెలంగాణ ప్రజలకు పర్వదినం... మీరు నిండు నూరేళ్లు సంపూర్ణ ఆరోగ్యంతో వర్ధిల్లాలని, జాతికి మీ నాయకత్వం మరిన్ని దశాబ్దాలు దిశా నిదర్శనం చేయాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.తెలంగాణ ప్రజలకు ఎనలేని విశ్వాసం, ఎనలేని ప్రేరణ అయిన ప్రియతమ నేత కేసీఆర్ కి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలని పేర్కొన్నారు.

# ధవళేశ్వరం బ్యారేజ్ గేట్ల పునర్నిర్మాణానికి రూ 150.09 కోట్లు

## మంత్రి నిమ్మల రామానాయుడు

అమరావతి మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం నాడు అసెంబ్లీ లో ధవళేశ్వరం బ్యారేజ్ గేట్ల పునర్నిర్మాణం పై అసెంబ్లీలో సమాధానం చెప్పారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 10.13 లక్షల ఎకరాలకు సాగు, లక్షలాది మంది ప్రజలకు తాగు నీరు, పారిశ్రామిక అవసరాలు తీర్చుతోంది ధవళేశ్వరం బ్యారేజ్. గోదావరి డెల్టా వ్యవస్థకు గుండె వంటిది. 2014 లో నాడు టిడిపి ప్రభుత్వం గోదావరి డెల్టా ఆధునీకరణ కింద 31.77 కోట్లతో 175 గేట్లలో 58 కొత్త గేట్లు ఏర్పాటు చేసామని వెల్లడించారు.

2024 లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిన 117 గేట్లు మార్చడానికి 150.09 కోట్ల నిధులు మంజూరు చేసాం. బ్యారేజ్ ప్రమాదంలో ఉందని సీడబ్ల్యూ సిహెచ్చరించినా కూడా వైసీపీ ప్రభుత్వం బ్యారేజ్ వైపు కన్నెత్తి చూడలేదు. నాడు బ్యారేజ్ కి నిధులిచ్చిన చంద్రబాబే, మరలా నేడు ధవళేశ్వరం బ్యారేజ్ కి కొత్త గేట్ల ఏర్పాటుకు 150 కోట్లు నిధులిచ్చారు. దావరి డెల్టా కాలువల్లో నీటి సరఫరాకు అంతరాయం లేకుండా సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్టాప్ లాగ్ గేట్లను వినియోగిస్తూ, దశలవారీగా పనులు చేస్తాం. గోదావరి డెల్టాలో ముంపు సమస్య, లాకులు, గేట్ల మరమ్మత్తులకు సమగ్ర డిపిఆర్ తయారు చేయడానికి, లైడార్ సర్వే కోసం 13.4 కోట్లు కేటాయించాం. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఏరియల్ లైడార్ సర్వే జరుగుతోందని అన్నారు.

# భోలక్ పూర్ లో కేసీఆర్ జన్మదిన వేడుకలు

సికింద్రాబాద్ తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 72వ జన్మదిన పురస్కరించుకొని బన్సీలాల్ పేట్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ ఏసూరి మహేష్, గుర్రం పవన్ కుమార్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు వెంకటేశం రాజు ఆధ్వర్యంలో భోలక్ పూర్ లోని భ్రమరాంబిక సమేత మల్లన్న స్వామి దేవాలయంలో కెసిఆర్ పేరుపై గోత్రనామాలపై ప్రత్యేక పూజలు శివలింగానికి పంచామృతాల అభిషేకం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయం బయట కేక్ కట్ చేసి పలువురికి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ నిండు నూరేళ్లు అష్ట ఆరోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ తిరిగి 2029లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆకర్షించారు.


## జాగృతి నేతల అరెస్టు

హైదరాబాద్ బేగంపేట లోని ప్రజా భవన్ ముందు తెలంగాణ జాగృతి నాయకులు, మహిళల ను పోలీసులు అరెస్టు చేసారు. మహిళలను అరెస్ట్ చేస్తున్న వీడియోలను జాగృతి కార్యాలయ ఉద్యోగి లక్ష్మణ్ ను కుడా అదుపులోకి తీసుకున్నారు.

మహిళలకు రూ.2,500 ఇవ్వాలని, అంగన్ వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజా భవన్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం లో వినతిపత్రం ఇచ్చేందుకు జాగృతి నాయకులు వెళ్లారు.

# స్వామి వివేకానంద గురువర్యులు, కాళి ఉపసకుడు రామకృష్ణ పరమహంస

## -నేడు రామకృష్ణ పరమహంస జయంతి



కాళి ఉపసకుడిగా,స్వామి వివేకానంద గురువర్యులుగా జగమెరిగిన గురువుశ్రీ రామకృష్ణ పరమహంస... ఆయన అసలు పేరు గధాధర్ ఛటోపాధ్యాయ. ఇతను ఫిబ్రవరి 18, 1836న జన్మించాడు. 19 వ శతాబ్దపు "బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనం" లో ఈయన ప్రభావము చాలా ఉంది. ఆగష్టు 16, 1886న మరణించాడు. ఈయన ఒక ఆధ్యాత్మిక గురువు. విభిన్న మతాలు భగవంతుడిని చేరడానికి విభిన్న మార్గాలు అని అనుభవపూర్వకంగా మొట్టమొదటిసారిగా ప్రపంచానికి చాటిచెప్పిన వ్యక్తి.తనకి ఇష్టం లేకపోయినా గాని శిష్యుల కోరిక మేరకు శ్రీరామకృష్ణ పరమహంస ఒకరోజు పల్లకిలో కూర్చుని ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్తున్నారు. వారు వెళ్తున్న మార్గంలో ఒక వేశ్య వాడ వచ్చింది, చీకటి పడింది. విటుల కోసం ఎదురుచూస్తూ వేశ్యలు వారి ఇంటి గుమ్మం ముందు నిల్చుని ఉన్నారు. ఆ దృశ్యాన్ని రామకృష్ణ పరమహంస పల్లకిలో నుండి చూశారు. వెంటనే ఆ పల్లకి నుండి రామకృష్ణ పరమహంస బయటికి వచ్చి ఆ వేశ్యల దగ్గరికి వెళ్ళి వారి పాదాలకు మనస్ఫూర్తిగా, భక్తిభావనతో నమస్కారం చేస్తున్నారు. ఏమి జరుగుతుందో తెలియని ఆశ్చర్యంలో మునిగిపోయిన శిష్యులందరూ రామకృష్ణ పరమహంస గారిని తిరిగి పల్లకిలో కూర్చోబెట్టి కాళిమాత ఆలయానికి తీసుకువచ్చారు. శిష్యులందరూ.. "ఏంటిది గురువు గారు.. పల్లకి నుండి దూకి వేశ్యల కాళ్ళమీద పడి మొక్కడం ఏంటండి.." అని వినమ్రంగా అడిగారు.. దానికి పరమహంస "వాళ్ళు వేశ్యలుగా కనపడ్డారా మీకు.. నాకు మాత్రం సాయంత్రం వేళలో అన్ని చోట్ల అందరి రూపంలో నిలబడి నా తల్లి కాళిమాత నన్ను ఆప్యాయంగా పిలుస్తున్నట్టుగా అనిపించింది.." అని అన్నారు. ఈ సమాధానం వినేసరికి శిష్యులందరి హృదయంలో జ్ఞాన సూర్యుడు ఉదయించాడు.

జన్మకు అర్థం:

ప్రతి ఒక్కరి పుట్టుకకు ఒక కారణం ఖచ్చితంగా ఉంటుంది. ఇక్కడ పనికిరాని వాడు అంటూ ఎవరూ లేరు. ఒకరు స్వాతంత్రం సాధించడానికి పుడితే ఇంకొకరు సైంటిస్ట్ గా నూతన ఆవిష్కరణల కోసం పుట్టారు. ఒకరు డాక్టర్ గా ప్రాణాలను రక్షించడానికి పుడితే మరొకరు జవానుగా దేశ రక్షణ కోసం పుట్టారు. తమలోని శక్తిని, తమ విలువను పరిపూర్ణంగా తెలుసుకున్న వారే మహాత్ములుగా ఎదిగారు.. వారే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. రామకృష్ణ పరమహంస గారి జన్మకు కారణం సకల ప్రాణులను చైతన్య పరచడం. ఆధ్యాత్మిక తత్వమే సకల జనులను ఉన్నతులగా తీర్చిదిద్దుతుందని, ఆధ్యాత్మిక తత్వమే జనులకు ఉన్నతులగా తీర్చిదిద్దుతుందని, ఆధ్యాత్మిక తత్వమే జనులకు పరిపూర్ణ మనశ్శాంతిని కల్పిస్తుంది.. అని ఆచరించి, జీవించి, బోధించి ఎంతోమంది జీవితాలను కేవలం కొన్ని క్షణాలలో మార్చిన గురువు రామకృష్ణ పరమహంస. తల్లిదండ్రులు పరమహంసకు పెట్టిన పేరు గదాధర్, పశ్చిమ బెంగాల్ లోని కామార్పుకూర్ అనే మారుమూల గ్రామంలో అతిపేద తల్లిదండ్రులకు వారు జన్మించారు. పరమహంస గారికి చిన్నతనం నుండి చదువులు గాని, డబ్బు సంపాదించడం అనే వాటి మీద అస్సలు ఇష్టం ఉండకపోయేది. కాని లలితకళలు, చిత్రలేఖనం, ప్రకృతిని చిన్నతనం నుండి మనస్ఫూర్తిగా ప్రేమించేవారు. పాఠశాలకు వెళ్ళి ఉపాధ్యాయులు చెప్పే పాఠాల కన్నా సాధువుల బోధనలే శ్రద్ధగా వినేవారు. అప్పటి వరకు వారి జీవితం సాధారణంగానే సాగిపోయింది కాని కొంత కాలానికి పరిస్థితుల మూలంగా దక్షిణేశ్వరంలోని కాళిమాత దేవాలయంలో పూజారిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత వారి జీవితం సమూలంగా మారిపోయింది.

కాళిమాత దర్శనం:

పూజారిగా బాధ్యతలు తీసుకున్న నాటి నుండి గర్భగుడిలో ఉన్న కాళిమాత ప్రతిమను చూస్తూ "ఈ రూపంలో ఉన్నది నిజంగా కాళిమాత యేనా లేదంటే ఉట్టి జీవంలేని రాయి మాత్రమేనా" అని తదేకంగా చూసేవారు.

ఇందులో నిజంగా దేవత ఉంటే ఖచ్చితంగా నాకు కనిపించాలి, మాట్లాడాలి, నా ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి అని కాళిమాత ప్రత్యక్షం కావాలని ప్రార్థనలను ప్రారంభించారు. చిన్నపిల్లవాడిని కన్నతల్లి ఒంటరిగా ఒదిలిపెడితే ఆ పిల్లవాడు అమ్మకోసం ఎలా ఏడుస్తారో అలా అమ్మ దర్శనం కోసం కన్నీటితో వేడుకునేవారు.. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా ఆలయం, అడవి అన్న ప్రాంతం లేకుండా కాళిమాత దర్శనం అయ్యేంత వరకు ప్రార్థన ఆపలేదు. ఒక దివ్య రోజునాడు కాళిమాత దర్శనం పరమహంసకు కలిగింది. ఇలా ఒక్కరోజు జరగలేదు.. ఆయన ఎప్పుడు ఆర్తితో పిలిచినా గాని కన్నబిడ్డను చేరుకునే తల్లిలా ప్రేమతో అమ్మవారు దర్శన భాగ్యం కల్పించేవారు.

బోధనలు, వివేకనందుని శిష్యరికం:

రామకృష్ణ పరమహంస, శారదామాతలకు చిన్నతనంలోనే వివాహం జరిగినా కాని సంతానం, సంసార బంధంతో సమస్త మానవాళికి చెయ్యవలసినవి చెయ్యలేమని దంపతులిద్దరూ శారీరకంగా జీవితాంతం కలవకుండా బ్రహ్మచర్యం పాటించారు. రామకృష్ణ పరమహంస గారి గురువు తోతాపురి. ఆయన బోధనలతో పరమహంసకు తాను ఎవరో తన పుట్టుకకు అర్థం ఏమిటో తెలుసుకున్నారు. ఇక అప్పటి నుండి తన బోధనలను విశ్వవ్యాప్తం చేశారు. హిందూ మతం నుండి మాత్రమే కాదు ఇస్లాం, క్రైస్తవం మొదలైన మతాలవారు పరమహంస వద్దకు వచ్చి జీవితంలోని ఆనందాన్ని పొందేవారు. ఈ క్రమంలోనే అప్పటివరకు ఎన్నో అనుమానాలతో ఉన్న నరేంద్రనాథ్ దత్తా రామకృష్ణ పరమహంసను కలుసుకుని ఆయన స్పర్శతో భగవంతుని దర్శన అనుభూతికి లోనై స్వామి వివేకనందునిగా ప్రపంచ చీకటిలో ఒక జ్ఞాన కాగడా ద్వారా వెలుగునందిస్తున్నారు.పరమహంసుల అద్వైత తత్త్వం.ఒక లక్ష్యానికి తమకు తోచినట్టుగా ఒక మార్గాన్ని నిర్ధేశించుకున్నట్టే దైవాన్ని చేరుకోవడానికి మనుషులు అనేక మార్గాలు నిర్మించుకున్నారు.. ఆ మార్గాలే వివిధ మతాలు.ప్రతి ఒక్క ప్రాణిలో భగవంతుడు ఉంటాడు. ప్రతి ఒక్క వస్తువు భగవంతుని అద్భుత సృష్టి.సృష్టి అంతా ఒకే శరీరంలో ఉంది ఆ శరీరమే భగవంతుడు.ఉన్నది ఒక్కడే భగవంతుడు కాని పేర్లు అనేకం, శరీరాలు అనేకం.కామం, స్వార్ధం, ఈర్ష్య, కోపం మొదలైన వాటిని వీడితేనే భగవంతుని దర్శనం కలుగుతుంది. వీటి మూలంగానే మానవుడు కర్మ చక్రంలో బంధిగా ఉంటున్నాడు. వీటిని వదిలినప్పుడు మాత్రమే ప్రతి ఒక్కరిలో దేవుడిని చూడవచ్చు.ప్రతి ఒక్కరిలో భగవంతుడు ఉన్నాడు కనుక ప్రాణులకు సేవ చేస్తే ఆ సేవ భగవంతునికి చేసినట్టే.రాముడు, కృష్ణుని కలయికయే రామకృష్ణ పరమహంస అని ఆయన శిష్యులు విశ్వసిస్తారు. కులాలు మతాలలో ఉన్న భేదాలను, మూడనమ్మకాలను రూపుమాపి ప్రతి ఒక్కరిలో మనస్ఫూర్తిగా దేవుడిని దర్శించమని ఆయన బోధించారు. రామకృష్ణ పరమహంస మరణించి ఇప్పటికి 131సంవత్సరాలైనా గాని ఆయన సందేశం నిరంతరం కొనసాగాలని దేశంలో ఎన్నో వందల రామకృష్ణ మఠాలను ఆయన గౌరవ శిష్యులు స్థాపించి యువకులకు మార్గనిర్ధేశం చేస్తున్నారు. ఆ యువకులలోనే ఎంతోమంది వివేకనందులు వస్తున్నారు.. నిజంగా ఒక్కరి పుట్టుక ఎంతోమంది జీవితాలను ఉన్నతంగా మార్చగలదు అన్నదానికి ఉత్తమ ఉదాహరణ పరమహంస.. ఇవ్వాల్టిరోజు ఈ భూమి మీదకు వచ్చిన రామకృష్ణ పరమహంస కి శతకోటి జన్మదిన శుభాకాంక్షలు.

# ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని కైవసం చేసుకున్న బి ఆర్ ఎస్



రంగారెడ్డి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. 24 మంది కౌన్సిలర్లలో మ్యాజిక్ ఫిగర్ 13 కాగా 15 మంది కౌన్సిలర్ల మద్దతుతో మున్సిపల్ పీఠం టిఆర్ఎస్ కైవసం చేసుకుది. బి ఆర్ ఎస్ నుంచి గెలిచిన 13 మంది, బిజెపి నుంచి ఒకరు, మరో ఇండిపెండెంట్ కలిపి 15 కౌన్సిలర్లతో సుదర్శన్ రెడ్డి చైర్మన్ గా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన 8 మంది ఒక బీజేపీ అభ్యర్థితో కలిపి 9 మందితో కాంగ్రెస్ సరిపెట్టుకుంది. చైర్మన్ గా సుదర్శన్ రెడ్డిని బిఆర్ఎస్ కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్ గా బిజెపి కౌన్సిలర్ ముత్యాల శ్యామల ఎన్నికయ్యారు. .

# జెఇఇ మెయిన్ పరీక్షలో మెరిసిన బీసీ ఇంటర్ విద్యార్థులు

**పరీక్ష కు హాజరైన 318 మంది విద్యార్థులు**
**90పర్సెంటైల్ పైగా సాధించిన 5గురు విద్యార్థులు**
**80 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించిన 28మంది విద్యార్థులు**
**- మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ప్రిన్సిపల్ కార్యదర్శి శ్రీధర్ గారు, ఎంజెపి సోసైటీ కార్యదర్శి సైదులు గారు**


R. KOUSHIK
260310437112
OBC - 91.25


M. NARENDER
260310687650
OBC - 91.58


B. MALLESH
260310477528
OBC - 90.50


B. HARISH
260310338002
OBC - 89.19


D.ROHAN
260311187372
OBC-88.05


A. NITHYA
260310190885
OBC - 92.19


CH. GAYATHRI
260310109291
OBC - 91.50


A. SAHASTHRA
260310256060
OBC - 87.69


M. SNEHA
260310040770
OBC - 85.09


P. CHARITHA DEVI
260310241492
OBC - 86.20

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** దేశవ్యాప్తంగా మొదటి విడతలో జరిగిన జెఈఈ మెయిన్ ప్రవేశ పరీక్షలో బీసీ గురుకుల ఇంటర్ విద్యార్థులు 318 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో ఐదుగురు విద్యార్థులు 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. మరో 28మంది విద్యార్థులు 80 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. బాలికల విభాగంలో ఏ. నిత్య (92.19) , సిహెచ్ గాయత్రి ( 91.50), ఎం. సహస్ర ( 87.69), పి. చరిత(86.20), ఎం. స్నేహ(85.09) పర్సంటైల్ సాధించారు. బాలుర విభాగంలో ఎం. నరేందర్(91.58), ఆర్ . కౌశిక్ (91.25), బి.మల్లేష్( 90.50), బి.హరీష్ (89.19), డి.రోహన్(88.05) పర్సంటైల్ సాధించారు. గతంలో రెండు సీఓఈ లలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తుండగా తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పది సీఓఈ లను ఏర్పాటు చేయడమే కాకుండా లాంగ్ టర్మ్ కోచింగ్ కూడా ఇస్తున్నదని ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు అధిక సంఖ్యలో పోటీ పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించారని, రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ఆకాంక్షించారు.అత్యుత్తమ ప్రతిభను చూపిన విద్యార్థినీ, విద్యార్థులను, బోధనా సిబ్బందిని మంత్రి గారు, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఈ. శ్రీధర్ , ఐఎఎస్, ఎంజెపి సోసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఐఎఫ్ఎస్ అభినందించారు.

## ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని పునః సమీక్షించాలి: రంగారెడ్డి జిల్లా టీజీఓ అధ్యక్షుడు డాక్టర్ కె రామరావు మరియు కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి




**రంగారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** మంగళవారంనాడు రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ కె రామరావు మరియు కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి (ఎంప్లాయిస్ హెల్త్ స్కీం) పైన రంగారెడ్డి జిల్లా అధికారులు మరియు ఇతరుల నుండి అందిన సూచనలు / ప్రతిపాదనల ఆధారంగా టీజీఓ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ ఏలూరి శ్రీనివాస రావు ఽ ప్రధాన కార్యదర్శి శ్రీ బి. శ్యామ్ కు వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది. ఇఊూ పైన ప్రభుత్వం తో రాబోయే చర్చలలో మా వినతులను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వానికి నివేదించవలసినదిగా కోరడమైనది.

## రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను కొనసాగించాలి



**రంగారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) గారికి వినతి పత్రం గత వారం సీసీఎల్ఏ కార్యాలయం నుండి జారీ చేయబడిన మెమో ప్రకారం రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 632 మంది టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లు మరియు రంగారెడ్డి జిల్లాలో పని చేస్తున్న (42) మరియు వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి.ఈ సందర్భంగా, గత ప్రభుత్వాలచే నియమించబడిన టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లు ఎంతో కాలంగా రెవెన్యూ శాఖలో నిరంతరాయంగా సేవలు అందిస్తూ శాఖ పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తున్నామని మాలో చాలా మంది వయోపరిమితి దాటిపోయినందున ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా అర్హత కోల్పోయిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు.ముఖ్యంగా, ఈ 632 మంది సిబ్బంది మరియు వారి కుటుంబాల సామాజిక భద్రత, ఆర్థిక స్థిరత్వం మరియు జీవనోపాధి పూర్తిగా ఈ ఉద్యోగంపై ఆధారపడి ఉన్న నేపథ్యంలో, వారి సేవలను నిలిపివేయడం వలన తీవ్రమైన ఆర్థిక మరియు సామాజిక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని విన్నవించుకోవటం జరిగినది.







ఈ కార్యాక్రమంలో టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లు రమేష్, రాజు, అనిల్, శ్రీనివాస్, పరమేశ్వర్,సుజాత, కామాక్షి, వనజ, మరియు వివిధ కలెక్టరేట్ , ఆర్డీఓ మండల ఆపరేటర్లు పాల్గొన్నారు

## మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి
## రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




**కామారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** మంగళవారం ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు- కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ., ఏ.ఈ.ఆర్.ఓ లతో ప్రత్యేక సమగ్ర సవరణకు ముందుగా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుండి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందుకు గాను గ్రామ పాలన అధికారులు, ఇతర అధికారులను బూత్ స్థాయి అధికారులకు మ్యాపింగ్ లో సహాయకులుగా నియమించి మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి పార్టీ నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా



అవగాహన కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, ఏ ఈ ఆర్ ఓ లు వారికి మ్యాపింగ్ చేయడంలో సహాయ సహకారాలు అందించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జరిగేలా పకడ్బందీగా ప్రక్రియ చేయాలని తెలిపారు.బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ విక్టర్, ఖీఆూ లు వీణ, పార్థ నరసింహా రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియలో వేగం పెంచాలి
## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఓటరు మ్యాపింగ్ నిర్వహణపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో నుంచి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, ఓటరు ప్రోజెని మ్యాపింగ్‌లో మరింత వేగవంతం చేయాలని సూచించారు. 2002 వివరాలతో ప్రస్తుత వివరాలను సరిపోల్చి మ్యాపింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓలు) తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రక్రియను అమలు చేయాలని, రోజువారీగా మ్యాపింగ్ వివరాలను సమర్పించాలని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా ప్రోజెని మ్యాపింగ్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, తహసిల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం 17 ఫిబ్రవరి 2026**ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య తన అద్భుత మేధో శక్తితో హైదరాబాద్ నగరంలో నివసించే ప్రజానీకానికి దప్పిక తీర్చడం కొరకు సహజ సిద్ధమైన గురుత్వాకర్షణ శక్తితో గండిపేట జలాశయం నుండి మిరాలం ట్యాంకు వరకు శతాబ్దం క్రితం పైప్ లైన్ వేయడం జరిగినది. ప్రత్యయముగా రెండవ పైప్ లైన్ గత మూడు దశాబ్దాల క్రితం సింగూరు ప్రాజెక్టుకు అనుసంధానముగా వేయడం జరిగినది. మొదటి పైపు లైన్ ద్వారా నీటి లీకేజీ అవుతున్నదని మణికొండ, నెక్నంపూర్ భారత రాష్ట్ర సమితి పార్టీ స్థానిక నాయకులు పలుమార్లు సంబంధిత అధికారులకు సమాచారం అందించినను నిమ్మకు నీరెత్తినట్లు



గమ్మున కూర్చుని సంబంధం లేనట్లు వ్యవహరించడం పట్ల ఆగ్రహం వ్యక్త పరిచడమైనది.ప్రస్తుత తరుణంలో చట్ట పరిధికి తూట్లు పొడుస్తు రెండవ పైప్ లైన్ కు అనుసంధానముగా మురుగు నీటి డ్రైనేజ్ పారుదల లైన్ వేయడం ఎంత వరకు సబబని ప్రజలు తీవ్రముగా ఆక్షేపణ తెలియ జేసినారు. పైపెచ్చు తు తు మంత్రంముగా పైప్ లైన్ ల మధ్య మట్టిని నింపి నాణ్యత లోపించిన రోడ్డు వేయడం చేయడం జరిగినది. పర్యవసానముగా గత రాత్రి 2 గంటలకు, రెండవ నీటి పైప్ లైన్ పగలడం రోడ్డు కాస్త కృంగిపోవడం, నీరు ఉవ్వెత్తున లేచి రోడ్డుని మించి ప్రక్కనే గల మహా సాయి రెసిడెన్సీ, సాయి మీనాక్షి రెసిడెన్సీ సెల్లార్ లలో మొత్తంగా నిండి ద్విచక్ర వాహనాలు, కారులు మునిగినవని, నివాసితులు అప్రమత్తముగా ఉండి ట్రాన్స్ఫారములు ఆపు చేయడం వలన పెను ప్రమాదం తప్పినదని నివాసితులు తెలియ జేసినారు. ఇందుకు సంబంధించిన నీటి సరఫరా ఆపు చేసి మరమ్మత్తులు చేపట్టే సమయములో, మురుగు నీటి డ్రైనేజ్ పారుదల మొత్తంగా మంచి నీటి పైప్ లైన్ లో కలవడం జరుగుతున్నదని పసిగట్టడం జరిగినది. ఈ చర్యకు మొత్తంగా బాధ్యులైన కాంట్రాక్టర్ మరియు పర్యవేక్షణ గావించిన అధికారులపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# సంగారెడ్డిలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 17(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/తెలంగాణ తొలి ముఖ్యమంత్రి,బిఆర్ఎస్ అధినేత కే. చంద్రశేఖర్ జన్మదిన సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి పట్టణంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు,సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ శ్రేణులు కేక్ కట్ చేసి కెసిఆర్ కు హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు,ఈ సందర్భంగా మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు మళ్లీ "కారే కావాలి" అని కోరుకుంటున్నారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ప్రజాభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేశాయని, పంచాయతీ మరియు మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ప్రజల మనసులను గెలుచుకుందని పేర్కొన్నారు,పోలీస్ అండ, డబ్బుల ప్రభావంతోనే మున్సిపల్ చైర్మన్ పదవి దక్కిందని ఆరోపించారు. డబ్బుల ప్రభావం, పోలీసుల అత్యుత్సాహం మధ్య వచ్చిన ప్రజా తీర్పును బిఆర్ఎస్ పార్టీ శిరసావహిస్తుందని తెలిపారు,బిఆర్ఎస్ పార్టీకి చెందిన పది మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే సహకారంతో పట్టణ సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నారని, ఇచ్చిన హామీ మేరకు ప్రతి వార్డుకు రూ. 8 కోట్లు మంజూరు చేసే వరకు నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు,ప్రజలు ఆలోచిస్తున్నారు,కెసిఆర్ తిరిగి రాక ఖాయమని ధీమా వ్యక్తం చేశారు,ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు హక్కీమ్, డా. శ్రీహరి, పట్టణ అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి,మధుసూదన్ రెడ్డి, విఠల్, మల్ల గౌడ్, రామప్ప, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ అంజాద్, యువత అధ్యక్షులు వాజిత్,శ్రవణ్ రెడ్డి, కౌన్సిలర్లు కొత్తపల్లి శ్రీకాంత్, జలందర్,లాడే మనిలా మల్లేశం, నక్క మంజులత నాగరాజ్ గౌడ్, పొన్న రాజేందర్ రెడ్డి, పొన్న దశరథ్ రెడ్డి, శ్రీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# మణికొండ, నెక్నంపూర్ లో కే సి ఆర్ పుట్టిన రోజు వేడుకలు



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 17 ఫిబ్రవరి 2026**భారత రాష్ట్ర సమితి పార్టీ అధినేత తెలంగాణ రాష్ట్ర జాతి పిత, తొలి ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పుట్టిన రోజు వేడుకలు మణికొండ, నెక్నంపూర్ డివిజన్ పరిధిలోని పుప్పాలగూడ శ్రీ నల్ల పోచమ్మ ఆలయములో భారత రాష్ట్ర సమితి పార్టీ స్థానిక నాయకుల ఆధ్వర్యములో పూజాది కాలతో కార్యక్రమం మొదలుపెట్టిన శుభ సందర్భముగా, ప్రజలతో పాటు స్థానిక నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కే సి ఆర్ కలకాలం సంపూర్ణ ఆయురారోగ్యాలతో విరాజిల్లాలని ఆ అమ్మవారిని



కోరుకోవడం జరిగినది, తదనంతరం కేక్ కటింగ్ చేసి, ఆలయ కమిటీ ఆధ్వర్యములో అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి హాజరు కావడం సంతోష కరముగా ఉన్నదని కార్యక్రమములో పాల్గొన్న స్థానికులు, కార్యకర్తలు, నాయకులు తెలియ చేయడం జరిగినది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

ప్రజాబలం ప్రతినిధి ఫిబ్రవరి 17:తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ ఆదేశానుసారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద విద్యార్థి జనసమితి ఆధ్వర్య.లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు చెరుకు శివరాజ్ మాట్లాడుతూ ఫీజు రీయంబర్స్మెంట్ ఆలస్యం కారణంగా వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్టిఫికేట్లు, మార్క్ మెమోలు పొందడంలో సమస్యలు ఎదురవుతున్నాయని, ఉన్నత విద్య మరియు ఉద్యోగ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఫీజు రీయంబర్స్మెంట్ అనేది సంక్షేమ పథకం మాత్రమే కాకుండా విద్యార్థుల హక్కు అని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను పూర్తిగా విడుదల చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా స్థిరమైన చెల్లింపు షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. "ఫీజు రీయంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు విద్యార్థి జన సమితి శాంతియుత ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విగ్నేష్, రాకేష్, వంశీ, కార్తీక్, శివ, తరుణ్, సుధాకర్, అవినాష్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.



# సాంబయ్య భౌతికకాయానికి నివాళులర్పించిన మల్లి బాబు యాదవ్



**ఇల్లందు ప్రతినిధి ఫిబ్రవరి 17 (ప్రజాబలం)** కామేపల్లి మండలం కొమ్మినేపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చల్ల సాంబయ్య మంగళవారం నాడు అనారోగ్యంతో మరణించారు. వారి భౌతిక కాయానికి మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, పిఎసిఎస్ అధ్యక్షులు ధనియాకులహనుమంతరావు, సర్పంచ్ ధరావత్ అనురాధ జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ ఫతే మహమ్మద్, తోటకూరి శివయ్య, గుజ్జర్లపూడి రాంబాబు పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. మరి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు, ఒక ఇంటి యజమాని కోల్పోవడం ఇంటి వాళ్లకు తీరని లోటుగా ఉంటుందని, మల్లి బాబు యాదవ్ విచారం వ్యక్తం చేశారు. వారికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. చల్ల సాంబయ్య మొదటి నుండి కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలుకుతూ చివరి వరకు కూడా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగానే మరణించారని, వారు పార్టీకి చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, షేక్ రబ్బానీ పాషా, ధరావత్ లాలు, జక్కంపూడి వెంకటేశ్వర్లు, బండి ఉపేందర్,చల్ల మల్లయ్య చల్ల నాగేశ్వరరావు, చల్ల పెద్ద మల్లయ్య, బండి నాగేశ్వరరావు, దేరంగుల తిరపయ్య, రామచంద్రు, మొగిలి శ్రీను, మరియు తదితరులు పాల్గొన్నారు

# ఓయూలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



**ప్రజాబలం ప్రతినిధి ఫిబ్రవరి 17:**ఓయూ లో బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోటపోతుల రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ అధినేత రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ హాజరైన ఓయూ విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ కెసిఆర్ జన్మదినం అంటే మాకు పండుగ రోజు అన్నారు. కొట్లాడి సాధించిన తెలంగాణ ను వారి పాలన లో అన్ని రంగాల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపారన్నారు. అదేవిదంగా కెసిఆర్ కు భగవంతుడు మంచి ఆయురారోగ్యాలు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ బిఆర్ఎస్వి పక్షాన, ఓయూ విద్యార్థుల పక్షాన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# సదాశివపేట పాలకవర్గానికి సన్మానం...



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 17(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/సదాశివపేట మున్సిపాలిటీలోని గెలిచినా కాంగ్రెస్ పార్టీ 17 మంది కౌన్సిలర్లకు రేణుక శ్రీనివాస్ గౌడ్ పూలమాలలతో,శాలువాలతో సత్కారించి స్వీట్లు తినిపించారు,ఇందులో భాగంగా మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి గెలిచినా ఓడినా అభ్యర్థులకు వార్డులలో ఇంచార్జిగా బాధ్యతలు ఇవ్వటం జరుగుతుంది అని అన్నారు,ఇది నిర్మల జగ్గారెడ్డి మాటగా అందరూ గౌరవించి ఏ పనులు ఉన్నా కాంగ్రెస్ పార్టీ పోటీ దారుల చేతులు మీదుగానే జరిపించలని అన్నారు,రేణుక శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రజా జీవితంలో గెలుపు ఓటమిలు సహజం,పార్టీ అధికారంలో ఉంది కాబట్టి నాయకులు సహకారంతో 8 వార్డు అభివృద్ధికి కృషి చేయాలి అని కోరారు.ప్రజలకు ఇచ్చిన మాటలను నిల బెట్టుకుంటాను వార్డ్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు,కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఈశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వంచే నిర్మల జగ్గారెడ్డి సహకారంతో చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల అండదండలతో వార్డు అభివృద్ధికి సహకరిస్తాం అని అన్నారు,ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆశీ రెడ్డి,సిద్దన్న,మహమ్మద్ వాసిమ్, మునపల్లి అంజమ్మ సత్యనారాయణ చైర్మన్, రేణుక చిరంజీవి వైస్ చైర్మన్,కౌన్సిలర్లు నర్సిములు, ఫాతిమా,అనిత,అరుణ్ కుమార్,గోపీ ప్రియాంక, పులిమామిడి అనిత,గౌసియా బేగం,మహమ్మద్. షఫీ,ఆకుల నిఖిత ప్రేమ్ బిట్ల,రోజా పట్లూరి, మహమ్మద్. వాజీద్,లక్ష్మి ప్రియా,గౌరీ దేవి,కోవూరి శంకర్ గౌడ్, యువ నాయకులు ఎర్ర ఆశిష్ గౌడ్, కటికర్ కళ్యాణ్ చక్రవర్తి, ఎర్ర సందీప్, మహమ్మద్ వాజీద్, షైక్ జైను,భవాని ప్రసాద్, మారేపల్లి సాయికుమార్ గౌడ్,ఔసాలి మోహిత్,షోయిబ్ మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,యువకులు మరియు వార్డు సభ్యులు పెద్ద ఎత్తునా పాల్గొన్నారు.

# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

## రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 17 :** ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు-కలెక్టర్లు,ఈ.ఆర్.ఓ.,ఏ.ఈ.ఆర్.ఓ లతో ప్రత్యేక సమగ్ర సవరణకు ముందుగా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ...బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందుకు గాను గ్రామ పాలన అధికారులు, ఇతర అధికారులను బూత్ స్థాయి అధికారులకు మ్యాపింగ్ లో సహాయకులుగా నియమించి మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి పార్టీ నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, ఏ ఈ ఆర్ ఓ లు వారికి మ్యాపింగ్ చేయడంలో సహాయ సహకారాలు అందించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జరిగేలా పకడ్బందీగా ప్రక్రియ చేయాలని తెలిపారు.బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న ఫారం 6,7,8 దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులతో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేలా పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు,తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గుర్తు తెలియని వాహనం

## ఢీకొని జోగిపేట ఎస్ఐ కి గాయాలు



గాయపడిన ఎస్ఐ పాండుగౌడ్, నుజ్జునుజ్జయిన పోలీసు వాహనం

**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 17 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో, జోగిపేట, ఎస్ఐ, పాండుగౌడ్, గాయాలకు గురైన సంఘటన, చౌటకూర్ మండల పరిధిలోని, సరాప్ పల్లి, వద్ద సంగారెడ్డి- నాందేడ్, అకోలా, 161 వ, జాతీయ రహదారిపై, సంఘటన చోటుచేసుకుంది, పోలీసుల కథనం ప్రకారం, ఎస్ఐ, పాండుగౌడ్, సిబ్బందితో కలిసి, జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, తెల్లవారుజామున, జోగిపేట నుంచి గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి పోలీసు వాహనాన్ని ఢీకొంది, ఈ ప్రమాదంలో ఎస్ఐ పాండు గౌడ్,కు తలకు, నడుము, భాగంలో బలమైన గాయాలయ్యాయి, విషయం తెలుసుకున్న, (ఎన్ హెచ్ ఏ ఐ) అంబులెన్స్ సిబ్బంది, సంఘటనా స్థలానికి చేరుకొని, ఎస్ఐ, పాండు గౌడును, చికిత్స నిమిత్తం సంగారెడ్డి లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, ప్రమాదంలో పోలీసు వాహనం నుజ్జునుజ్జు అయింది, పోలీసు వాహనాన్ని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం కోసం, జాతీయ రహదారిపై అమర్చిన, సీసీ కెమెరాల పుటేజ్ ని పరిశీలిస్తున్నారు, ఈ మేరకు పుల్కాల్ పోలీసులు, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు......

# 2వ వార్డు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చటం నా బాధ్యత...

## కౌన్సిలర్ ఎరుకల నర్సింలు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 17(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సదాశివపేట/ మున్సిపల్ కౌన్సిల్ నూతన పాలకవర్గంలో ప్రమాణ స్వీకారం చేసిన 2వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి ఎరుకల నర్సింలు,ఒక ప్రకటనలో వారు మాట్లాడుతూ 2వ వార్డు ప్రజలు నా పైన నమ్మకం ఉంచి నన్ను గెలిపించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున ధన్యవాదాలు,2వ వార్డు,ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చటం నా బాధ్యత వార్డులో ఏ సమస్య ఉన్నా 24 గంటలు మీకు అందుబాటులో ఉండి మీకు సహకారం అందిస్తూ అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు,జగ్గారెడ్డి ఇస్తాను అన్నా ప్లాట్లు,రోడ్లు,మోరిలు,బోర్లు,విద్యుత్ దీపాలు,వంటి మౌలిక సదుపాయాలు కలిగిస్తూ వార్డుకి ప్రభుత్వం ఇచ్చే ప్రతి పథకం అర్హులైన వారికి అందేలా చేస్తా అని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు పెద్దలు మహిళలు యువకులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి....

## అడిషనల్ కలెక్టర్ మాధురి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 17(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ మాధురి సంబంధిత అధికారులకు సూచించారు,మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు,ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో ఎలాంటి తప్పిదాలు లేకుండా మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేయాలన్నారు. బిఎల్ఓ లు మ్యాపింగ్ ప్రక్రియకు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు,ఈఆర్ఓలు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమగ్రంగా పర్యవేక్షించి, వేగంగా పూర్తయ్యేలా సహకరించాలన్నారు,వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తి చేస్తామని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు సూపర్వైజర్లు, బిఎల్ వో లు అంకితభావంతో పనిచేసేలా సంబంధిత మండలాల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు,ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, డీఎం సివిల్ సప్లై అంబాదాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,తహసిల్దార్ లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజులకు దక్కిన అరుదైన గౌరవం

## జోగిపేట వైస్ చైర్మన్ గా చిట్టిబాబు ముదిరాజ్





**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 17 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** ఆందోల్ -జోగిపేట, మునిసిపల్ కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం, సోమవారం నాడు, మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు, ఈ కార్యక్రమంలో 20 వార్డుల మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రమాణ స్వీకారం చేశారు, 15వ వార్డు కౌన్సిలర్ చిట్టిబాబు, వైస్ చైర్మన్ గా నియమించబడ్డారు, గతంలో ఏదైనా వార్డు సభ్యునిగా, ఎంపీటీసీగా, కౌన్సిలర్ గా, సేవలందించారు, అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల పాత్ర పోషించి, ప్రస్తుత రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు, ముఖ్య అనుచరుడిగా పేరు పొందారు, ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి మంత్రి,ఆయనను వైస్ చైర్మన్ గా నియమించారు, ఆయన వైస్ చైర్మన్ గా ఎన్నిక కావడంతో, ముదిరాజుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి, ముదిరాజులకు కొన్ని సంవత్సరాల తర్వాత, అరుదైన గౌరవం దక్కిందని అన్నారు కుల పెద్దలు, ఏది ఏమైనా పార్టీలకు అతీతంగా, ప్రజల మనిషిగా, సేవా దృక్పథం కలిగిన వ్యక్తిగా, సేవా కార్యక్రమాలలో ముందుండే వ్యక్తిగా, ఆయన పేరు తెచ్చుకున్నారు, ఆయన వైస్ చైర్మన్ గా ఎన్నికైనందుకు, ముదిరాజ్ బంధువులు, ప్రజాప్రతినిధులు, రిటైర్డ్ ఉద్యోగులు,15వ,వార్డ్ మహిళలు, యువకులు, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు....

# సముద్రపు మొగలో మేటలువేసిన ఇసుకను

## తొలగించాలని మత్సకారులు, రైతుల మహాదర్నా..

ముమ్మిడివరం. కాట్రేనికోన మండలం గచ్చకాయలపోర వద్ద కూనవరం స్ట్రైయిట్కట్ సముద్రపు మొగవద్ద వేసిన ఇసుకమేటలను తొలగించాలని అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల మత్సకారులు, రైతులు ధర్నా చేసారు..మొగ మూసుకుపోవడం వలన పది గ్రామాలకుచెందిన మత్సకారులకు జీవనోపాధి కరువై వలసబాట పడుతున్నారని, అలాగే పంటచేలు, పొలాలలో ముంపునీరు దిగేమార్గంలేక వేలాది ఎకరాల వరిచేలు, కొబ్బరితోటలు నాశనం అవుతున్నాయని అన్నారు..ఉదయం నుండే సముద్రపు మొగవద్దకు సుమారు మూడువేలమంది చేరుకుని సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీగా గచ్చకాయలపోర చేరుకున్నారు..సుమారు 2,300 ఎకరాల పర్రభూమి ఉండగా దీనిలో సగభాగం ఆక్రమించి బడాబాబులు త్రవ్విన చెరువులను ధ్వంశం చేయాలని డిమాండ్ చేసారు..

# 42 శాతం రిజర్వేషన్లు లేకుండా పరిషత్ ఎన్నికలు నిర్వహించవద్దు.

## బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం ఉధృతం చేస్తాం. కుంటి సాకులు చెప్పి ఎన్నికలు నిర్వహించవద్దు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** తెలంగాణ రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే పరిషత్ ఎన్నికలు నిర్వహించాలని బీసీ సాధికారిత సంఘం ఉత్తర తెలంగాణ జిల్లాల ఇన్చార్జి పొలాస నరేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం రోజు జరిగిన బీసీ ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలు తమ రాజకీయ చైతన్యంతో సత్తా చాటుతున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గత పంచాయతీ ఎన్నికలలో 17% రిజర్వేషన్లను ప్రభుత్వం కల్పిస్తే 39.5% స్థానాలను బీసీలు గెలుచుకున్నారని, మున్సిపల్ ఎన్నికలలో 31.4% రిజర్వేషన్లు కల్పిస్తే ఏకంగా 60.95% స్థానాలను బీసీలు గెలుచుకోవడం బీసీల ఐక్యతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. 105 మున్సిపాలిటీలలో 64 మంది, ఏడు కార్పొరేషన్లలో నలుగురు బీసీలు చైర్మన్లుగా గెలిచి రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు కోర్టులు అడ్డుపడుతున్నాయని, కేంద్రం నిధులు నిలిచిపోతున్నాయనే కుంటి సాకులతో ఎన్నికలు నిర్వహించడం రెండు కోట్ల బీసీల గొంతు కోయడమేనని పొలాస నరేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. 2024బి26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధుల పేరుతో బీసీల వాటాను తొక్కేయాలని చూడడం సరికాదన్నారు. 42 శాతం కోట అమలు చేసే వరకు పరిషత్ ఎన్నికలు జరుపవద్దని, తెలంగాణ రాష్ట్రంలోని ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లులు ఆమోదింప చేయాలని, లేనిపక్షంలో తెలంగాణ ఎంపీలు రాజీనామా చేసి బీసీ ఉద్యమంలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు తూపుకారి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి ఇల్లందుల వెంకటేష్ తో పాటు జిల్లా నేతలు ఉయ్యాల భూమయ్య గౌడ్, దేవయ్య, రాజేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు. భీమేశ్వరాలయంలో కోడె మొక్కు చెల్లించిన బి ఆర్ ఎస్ శ్రేణులు.






**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** తెలంగాణ రాష్ట్ర తొలి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన ఫిబ్రవరి 17వ తేదీ రోజున వేములవాడ పట్టణంలో బిఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు మొదట దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి అనుబంధాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో కల్వకుంట్ల చంద్రశేఖర రావు పేరిట కోడె మొక్కు చెల్లించి, చంద్రశేఖర రావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి బస్టాండ్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున గుమికుడి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు జై కేసీఆర్, జై జై కేసీఆర్ , లాంగ్ లీవ్ కెసిఆర్ అంటూ నినాదాలతో తెలంగాణ చౌక్ మార్మోగింది. గులాబీ జెండాలతో పార్టీ శ్రేణులు తెలంగాణ చౌక ప్రాంతాన్ని సందడిగా మార్చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి, నూతనంగా మున్సిపల్ కౌన్సిలర్ గా ఎన్నికైన వెంగళ అనిత బి శ్రీకాంత్ గౌడ్, వాసాల లావణ్యబిశ్రీనివాస్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు రామతీర్థపు మాధవి బిరాజు, నిమ్మశెట్టి విజయ్, జువ్వాడి ప్రశాంత రావు, మాదాడి గజానందర్రావు, రేగుల రాజేశం, దేవానంద్, వెంకట్ రెడ్డి, మారం కుమార్, సత్యనారాయణ రెడ్డి, పీచర భాస్కరరావు, పైడా శ్రీనివాస్, జంగేటిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.




**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మండలాల వారిగా పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇండ్లు మంజూరైన వారి మార్కౌట్ పూర్తి చేసి, పనులు ప్రారంభించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్షిస్తూ ఉండాలని తెలిపారు. నిర్మాణాలు మందగించిన ప్రాంతాల్లో లబ్ధిదారులతో మాట్లాడుతూ, నిర్మాణాలు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి రాజేశ్వర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంలో సాంప్రదాయ దుస్తులు, సెల్ ఫోన్ నిషేధానికి వినతి.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజస్వామి వారి ఆలయ పవిత్రతను కాపాడేందుకు, రాజన్న భక్తులు తప్పనిసరిగా సాంప్రదాయ దుస్తులు ధరించే నిబంధనలు విధించాలని కోరుతూ రాజన్న ఆలయ ఈవోకు వినతిపత్రం సమర్పించడం జరిగింది. వినతిపత్రం అందజేసిన నరేష్ పటేల్, విశాల్ కుమార్ మాట్లాడుతూ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు పురుషులు పంచె లేదా కుర్తాబిపైజామా, మహిళలు చీర లేదా చుడీదార్ (దుప్పటతో) ధరించి దర్శనానికి వచ్చేలా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని కోరారు. పాశ్చాత్య సంస్కృతిని ప్రతిబింబించే చిరిగిన జీన్స్, షాట్స్ వంటి దుస్తులను అనుమతించవద్దని కోరారు. సెల్ ఫోన్ నిషేధం రాజన్న మరియు భీమేశ్వర ఆలయంలో లోపల ముఖ్యంగా గర్భాలయం మరియు క్యూలైన్లలో భక్తులు గాని ఆలయ సిబ్బంది గానీ సెల్ ఫోన్ వినియోగించడం వల్ల ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతింటుందని, సెల్ఫీలు మరియు ఫోటోల వల్ల ఇతర భక్తుల కు అసౌకర్యం కలుగుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గాని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గాని ప్రముఖ పుణ్యక్షేత్రాల తరహాలో సెల్ ఫోన్ లను పూర్తిగా నిషేధించాలని, వాటిని భద్రపరచుకునేందుకు క్లాక్ రూమ్ సదుపాయం కల్పించాలని కోరారు. రాజన్న ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలకు ఈ నిబంధనలు కఠిన తరం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆలయాల పవిత్రతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యతని, తిరుమల తిరుపతి వంటి క్షేత్రాలలో ఉన్నట్లే వేములవాడ రాజన్న ఆలయంలో కూడా కఠినమైన డ్రెస్ కోడ్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. డ్రెస్ కోడ్ మరియు సెల్ ఫోన్ ల వినియోగంపై రాజన్న ఆలయ ఈవో రమాదేవి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

# ఖమ్మం నగర యువజన విభాగం ఆధ్వర్యంలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 17 (ప్రజాబలం)** ఖమ్మం తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి స్వరాష్ట్ర సాధకుడు బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలను పువ్వాడ అజయ్ కుమార్ నాయకత్వంలో ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు అజయ్ కుమార్ ఆదేశాల ప్రకారం ఖమ్మంలోని జీవన సంధ్య వృద్ధాశ్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం ఖమ్మం అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం కెసిఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి హాజరై కేసీఆర్ జన్మదిన కేకును కట్ చేసి ఆశ్రమంలోని వృద్ధులకు పార్టీ కార్యకర్తలకు పంచారు అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరిపోసి కోట్లాది మంది ఆకాంక్షలకు స్వరూపం కల్పించిన మహానాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ముందుకు నడిపి తెలంగాణను సాధించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. స్వరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రైతు సంక్షేమమే లక్ష్యంగా రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలను ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా





నిలిచారని చెప్పారు. సాగునీటి రంగంలో కాళేశ్వరం వంటి మహత్తర ప్రాజెక్టులతో తెలంగాణను సస్యశ్యామలం చేసిన దూరదృష్టి గల నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిలో ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు ఈ కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీ ప్రసాద్ రావు పువ్వాడ అజయ్ కుమార్ వ్యక్తిగత సహాయకులు చిరుమామిళ్ల రవి కిరణ్ ఆరో డివిజన్ కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు నాలుగో డివిజన్ కార్పొరేటర్ దండ జ్యోతి రెడ్డి 23వ డివిజన్ కార్పొరేటర్ మాగబుల్ బీఆర్ఎస్ యువజన విభాగం ఖమ్మం అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్ బాబు ఎస్టీ సెల్ అధ్యక్షుడు వాంకుడోత్ సురేష్ నాయక్ రఘునాధపాలెం మండల అధ్యక్షులు అజ్మీర వీరు నాయక్ రఘునాధపాలెం మండల నాయకులు పిన్ని కోటేశ్వరరావు, మెంటం రామారావు, నగర యువజన విభాగం త్రీ టౌన్ అధ్యక్షులు మాటేటి కిరణ్, నగర ప్రచార కార్యదర్శి సకిన, మహిళా విభాగం నాయకురాలు కొల్లు పద్మ,బీసీ సెల్ నాయకులు వీరేంద్ర గౌడ్ యువజన విభాగం నాయకులు కొమ్ము విజేత,తదితరులు పాల్గొన్నారు.

## నాడు కెసిఆర్ ధృడ సంకల్పంతోనే తెలంగాణ సాధ్యమైంది బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



హైదరాబాద్ ఫిబ్రవరి 17 : నాడు మాజీ సిఎం కెసిఆర్ ధృడ సంకల్పంతోనే తెలంగాణ సాధ్యమైందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. ఇటీవల కెసిఆర్ మీద పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్ లో 72 కిలోల కేక్ తో కెసిఆర్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కెసిఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో బాగుండాలని ఆకాంక్షించారు. ఏ జాతికి పిత అంటూ సన్నాసులు అవాకులు చవాకులు పేలుతున్నారని, జాతి మీద, జాతి అహంకారం మీద అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని కెటిఆర్ విమర్శించారు. 2001 లో బలమైన రాజకీయ శక్తులను ఢీకొట్టిన యోధుడని, దేశానికి తెలంగాణను రోల్ మోడల్ గా తీర్చిదిద్దిన నాయకుడు కొనియాడారు. 2001లో తెలంగాణ కోసం బయల్దేరిన నాడు పరిస్థితి ఏంది? అని ప్రశ్నించారు. నీతి ఉన్న..రీతి ఉన్న జాతి తమది అని, జన్, జంగిల్, జమీన్ కోసం పోరాడిన కుమురంభీం జాతి తమది అని తెలియజేశారు. అప్పటి మాజీ కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ కెసిఆర్ గురించి ఎంతో అద్భుతంగా చెప్పారని కెటిఆర్ పేర్కొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com